తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## తిరుచ్చి వాహనంపై "దేవేరులతో వేణుగోపాలుడు"

చంద్రగిరి, జూన్ 14 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆది వారం రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారు బంగారు తిరుచ్చిపై తిరు మాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు వివిధ రకాల విశేష అలంకరణలతో తిరుచ్చి వాహనంపై అధిష్టించారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆఫీస్ అసిస్టెంట్ హరిప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల పండువగా అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, జూన్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం స్వామి అమ్మవార్ల అమావాస్య ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రతి ఆమావాస్య సందర్భంగా ఉత్సవాన్ని నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆదివారం దీపారాధన తరువాత స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా ఆలంకరించి ఉత్సవానికి ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ రాజగోపురం నుంచి అలంకార మండపం వద్దకు చేర్చారు. ఇక్కడ ప్రత్యేక హారతులిచ్చి గ్రామోత్సవానికి ముస్తాబు చేసారు. ఆలయ ఇన్సెపెక్టర్లు వెంకటస్వామి వెంటరాగా మేళ తాళాలు మంగళవాయిద్యాలతో నాలుగుమాడావీధుల్లో ఉత్సవం సాగింది. భక్తులు ఇంటింటి వద్ద కర్పూర హారతులిచ్చారు.




## సీడ్స్ కార్యాలయం మూసివేతతో

# పనిలేక కార్మికుల పస్తులు

### రూ.కోట్ల విలువ చేసే యంత్రాలు తుప్పు పడుతున్న వైనం

శ్రీకాళహస్తి, జూన్ 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని ఎపి సీడ్స్ విత్తనాభివృద్ది సంస్థ రెండేళ్ళుగా మూతపడింది. పనుల్లేక కార్మికులు అల్లాడుతున్నారు. వ్యవసాయశాఖ మంత్రిని కలసిన కార్మికులకు కంటితుడుపుగా సమాధానం చెప్పి పంపారు. వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే తెలంగాణ విత్తనోత్పత్తి, ధరల ముందు ఇక్కడ పోటీపడలేక పోతున్నారు. దాంతో మూతపడక తప్పలేదు. సుమారు 11 ఎకరాల స్థలం గోదాములు, కోట్ల రూపాయలు విలువ చేసే యంత్రాలు రెండేళ్ళుగా పనులు ల్లేక తుప్పుపడుతున్నాయి. అయితే వ్యవసాయ శాఖ పట్టించుకోవటం లేదు. శ్రీకాళహస్తి వ్యవసాయక ప్రధానమైన ప్రాంతం. 1976లో ఇక్కడ పొరుగు రాష్ట్రాల నుంచి జొన్న దిగుమతి చేసుకొని విత్తనాభివృద్ది కోసం ఉత్పత్తి చేసేవారు. అప్పటి ప్రభుత్వం, పాలకులు, స్థానిక నాయకులు పరిశీలించి ఇక్కడ ఎపిసీడ్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసారు. మొదట జొన్న తరువాత కాలక్రమేణ వేరుశెనగ, తరువాత వరి లను విత్తనోత్పత్తిగా అందించే వారు. ఎపిసీడ్స్ కొత్త వంగడాలను ఒరైతులకు ఇచ్చి దానిని పండించగా మద్దతు ధరతో సేకరించే వారు. ఇందుకు పానగల్‌లో సుమారు 11 ఎకరాల స్థలాన్ని సేకరించారు. కోట్లు వెచ్చించి భవనాలను నిర్మించారు. ఇక్కడ కోట్ల విలువచేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యంత్రాలను ఏర్పాటు చేసారు. అలాగే రూ., కోట్లు వెచ్చించి గోదాములను నిర్మించారు. అయితే వాతావరణం మార్పుతోనూ, తెలంగాణ ఉత్పత్తుల ధరలతో పోటీ పడలేక రోజు రోజుకు పతానవస్థకు చేరింది, గత ఏడాది నుంచి మూత పడింది. సుమారు 30 సంవత్సరాలుగా సంస్థను నమ్ముకున్న కార్మికులు జీవనోపాధి లేక తల్లడిల్లుతున్నారు.



పనుల్లేక నిరుపయోగంగా యంత్రాలు

ఆంధ్రప్రదేశ్‌లోని విత్తనాభివృద్ది సంస్థ తెలంగాణ ఉత్పత్తులతో పోటీ పడలేక మూతపడుతున్నాయి. తెలంగాణలోని నిజామబాద్ వరి ఉత్పత్తికి పెట్టింది పేరు. గత కొన్ని సంవత్సరాలుగా పోటీగా కరీంనగర్ ముందుకు వచ్చింది, గోదావరి నీటితో నల్లరేగడిలో ఇబ్బడి ముబ్బడిగి వరి పండిస్తున్నారు. అక్కడ ఎకరాకు 50 నుంచి 55 బస్తాల దిగుబడి వస్తుంది. దాంతో అక్కడి రైతులు కారుచౌకగా విక్రయిస్తున్నారు. తెలంగాణ ప్రభావంతో ఆంధ్రలోని విత్తనాభివృద్ది సంస్థ తట్టుకోలేక పోతుంది. తమిళనాడులో మార్కెట్ కుప్పకూలింది. ఈనేపథ్యంలో శ్రీకాళహస్తిలోని విత్తనాభివృద్ది సంస్థ ఉత్పత్తి చేసే వరివంగడం గిట్టుబాటు ధర రూ.32లు చెల్లించి ఖర్చులు రూ.5లు కలుపుకొని రూ.37లకు విక్రయించాల్సి వస్తుంది. అయితే తెలంగాణ రైతులు అదే వరిని కేవలం రూ.16 నుంచి 20లకు విక్రయించటం వల్ల ఇక్కడ ధరలు పతనమయ్యాయి. గత ఏడాది ఇక్కడి ఎపిసీడ్స్ సంస్థ సేకరించిన 150క్వింటాళ్లు అమ్ముకోలేక కాలం చెల్లిన తరువాత వేలం వేసుకునే దుస్థితి చోటు చేసుకుంది. అదే ఇక్కడ ప్రవేటు డీలర్లు ఒక్క రోజులో 150 క్వింటాళ్ళ వరిని తెలంగాణ రకాలు అమ్ముకోగల్గినారు. దాంతో సిబ్బందికిజీతాలు కూడా చెల్లించలేని దుస్థితి చేరుకుంది.

**వేరుశెనగ ఇద్దామంటే . . .**

ఇక్కడ విత్తనోత్పత్తి సంస్థ వరి వంగడం తయారు చేసి అమ్ముకోలేక వేరుశెనగ సరఫరాకు నిర్ణయించారు. అయితే విత్తనం సేకరణకు సంబంధించి గతంలో ఒరైతులు, పలు సంస్థలు సరఫరా చేసిన వేరుశేనగకు ప్రభుత్వం రూ.700కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇటీవల ప్రభుత్వం రూ.200కోట్లు విడుదల చేయటానికి నిర్ణయించింది. ఇది కూడా మార్క్ ఫెడ్ నుంచి అప్పు. ఈ నిధులతో రైతులకు చెల్లించాల్సిన బకాయిల్లో కొంత మేరకు రూ.180కోట్లు చెల్లించి మళ్ళీ విత్తనసేకరణకు సిద్దమయ్యారు. కానీ సేకరణలో కూడా విఫలమయ్యారని చెప్పవచ్చు.

## బిడ్డను కాపాడ పోయి...

# తల్లి బిడ్డ మృతి







మృతి చెందిన తల్లి బిడ్డ(ఫైల్ ఫోటోలు)  రోధిస్తున్న కుటుంబసభ్యులు

శ్రీరంగరాజపురం, జూన్ 14 ప్రభాతవార్త

కూలికి వెళితేనే జీవనం సాగుతుంది... కూలికి వెళ్లి కొడుకుని కూతుర్ని చదివించుకుంటున్న తల్లి కూలి చేస్తున్న స్థలానికి బిడ్డ రావడం... సమీపంలోని ఫారం వద్దకు కుమారుడు సిద్ధార్థ్ వెళ్లడంతో బిడ్డను కాపాడు కోసం వెళ్ళిన తల్లి కాలు జారి ఫారం ఫండ్ లో పడి తల్లి బిడ్డ ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం నెలవాయి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఎస్ఆర్ పురం మండలంలోని నెలవాయి గ్రామపంచాయతీ నెల వాయి దళితవాడకు చెందిన సోమశేఖర్ రేవతి దంపతులకు ఓ కుమార్తె సౌమ్య (8తరగతి), కొడుకు సిద్ధార్థ్ పదవ తరగతి చదువుతున్నారు. ఆదివారం రేవతి (35) నెలవాయి గ్రామ పరిధిలో రఘుపతి నాయుడు పొలం లో కూలి పనికి వెళ్ళింది. కొడుకు సిద్ధార్థ్ (14) మధ్యాహ్నం సమయంలో తల్లి రేవతి దగ్గరికి వెళ్లాడు.. అక్కడే దొరికిన మామిడి పండ్లను తిన్నారు. పక్కనే ఉన్న ఫారం పాండ్ గుంతలో చేతులు కడుక్కోవడానికి వెళ్లిన సిద్ధార్థ్ చాలాసేపు వరకు రాకపోవడంతో తల్లి రేవతి సిద్ధార్థ వెతుక్కుని వారం ఫండ్ వద్దకు వెళ్లి కన్న బిడ్డను రక్షి ంచుకోవడానికి ప్రయత్నించిన తల్లి రేవతి ఆ గుంతలో దిగింది. తల్లి బిడ్డ ఇద్దరికీ ఈత రాకపోవడంతో ఆ గుంతలోనే అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు అంటున్నారు. తమ మధ్య ఉంటూ హఠాత్తుగా తల్లి బిడ్డ ఇద్దరూ మృతి చెందడంతో నెల వాయి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఆర్ పురం ఎస్ఐ సమన్ తెలిపారు.

## కార్వేటినగరంలో వైభవంగా చక్రస్నానం





కార్వేటినగరం, జూన్ 14 ప్రభాతవార్త:

కార్వేటినగరంలోని స్కంధపుష్కరిణిలో వేలాదిమంది భక్తుల నడుమ చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారిజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపారు. ఆలయాన్ని శుద్ధి చేసి తోమాలసేవ నిర్వహించారు. అనంతరం భక్తాంజనేయస్వామివారికి అభిషేకం చేశారు. 5.30,6 గంటల మధ్య చూర్ణాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో తిరువీధుల్లో ఊరేగించారు. స్కంధపుష్కరిణి వద్ద ఉత్సవర్లకు పాలు, పెరుగు, సుగంధద్రవ్యాలు, చందనం, నారికుళం, తెనేలతో స్నపన తిరుమంజన కార్యక్రమం చేశారు. అనంతరం స్కంధపుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం 5.30-7.30 మధ్య నవసంధి, మాఢవీధిఉత్సవం, ధ్వజావరోహణం చేశారు. అనంతరం కంకణభట్టాచార్యుల బహుమానం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి భక్తికీర్తనలతో స్వామివారి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ శ్రీనివాసులురెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చెంగల్రాయులు, అర్చకులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవి ఉంది.. కానీ పవర్ లేదు!

### తిరుపతి రూరల్‌లో పరిపాలనపై ప్రశ్నార్థకం

తిరుపతి రూరల్, జూన్ 14 ప్రభాతవార్త

తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయం ప్రస్తుతం ఒక విచిత్రమైన పరిపాలనా నాటకానికి వేదికగా మారింది. కుర్చీలో అధికారి ఉన్నా.. ఆ కుర్చీకి అసలు బలం లేదనే పరిస్థితి నెలకొంది. అధికారికంగా నిర్ణయాలు ఒకరి చేతిలో ఉండగా, అమలు మాత్రం మరొకరి చేతుల్లోకి జారిపోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆఫీసులో ఫైళ్లపై సంతకం ఎంపీడీవోదే అయినా, వ్యవహారాలు మాత్రం పరిపాలన అధికారి చుట్టూనే తిరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదేశాలు ఫైళ్లలోనే ఆగిపోతుండగా, అమలు స్థాయిలో అవి కనిపించకపోవడం పరిపాలనా లోపాలను బహిర్గతం చేస్తోంది. ఎంపీడీవో పదవి కేవలం ఆచారంగా మారిందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆఫీసులో అటెండర్ స్థాయి నుంచి ఏవో స్థాయి వరకు క్రమశిక్షణ సడలిపోయిందని, అధికారానికి గౌరవం తగ్గిపోయిందని అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. మండల్ పరిషత్ నిధులపై స్పష్టత లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. నిధులెంత? అన్న సాధారణ ప్రశ్నకే సమాధానం లేకపోవడం పరిపాలనా వ్యవస్థలో పారదర్శకత ఎంత దూరమైందో చూపిస్తోంది.




**ఆఫీసు అంతర్గత యుద్ధభూమి!"....**

కార్యాలయం మొత్తం ఒక అంతర్గత పోరాట వాతావరణంలో నడుస్తోందని సమాచారం. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజాసేవ దెబ్బతింటోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితులపై పైస్థాయి అధికారులు తక్షణం స్పందించి, వ్యవస్థలో క్రమశిక్షణను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. పరిపాలనలో స్పష్టత, బాధ్యత, సమన్వయం తీసుకురావాల్సిన అవసరం అత్యవసరంగా కనిపిస్తోంది.

## నిర్లక్ష్యం సహించను! -అసాంఘిక ...అక్రమాలపై కొరడా

### తిరుపతి జిల్లాలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

తిరుపతి, జూన్ 14ప్రభాతవార్తప్రతినిధి:

తిరుపతి నగరం పవిత్రతను, ప్రశాంతతను కాపాడటంతోబాటు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపేందుకు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, పోలీసుల్లో అక్రమాలు, అవినీతి ఉంటే మార్పుచేసుకోవాలని హెచ్చరికలు చేస్తున్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు, వ్యతిరేక పనులు చేస్తుంటే వారికి సహకారమందించినా, వారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. పోలీసుల్లో నిజాయితీ, అంకితభావం అలవరుచుకునే ఎస్పీ తీవ్రంగా తనదైన శైలిలో క్రిందిస్థాయి అధికారులను పనిచేయిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా ఆదివారం రాత్రి తిరుపతి జిల్లా వ్యాప్తంగా తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, చంద్రగిరి, రేణిగుంట ,భాకరాపేట ప్రాంతాల్లో ఒకేసారి పోలీసులు, అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.



స్వయంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మానిటరింగ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేయించడం మాత్రం అసాంఘిక కార్యకలాపాలపై, అసాంఘిక శక్తుల ఆగడాలపై ఉక్కుపాదం మోపేందుకేననే చర్చ మొదలైంది. కొందరు ఖద్దరు ముసుగులో చట్టవ్యతిరేక కార్యకలాపాలకుపాల్పడుతున్నారని, ఇందుకు స్టార్‌హోటళ్లలో గదులు, స్టేహోమ్‌లు అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారనేది ఎస్పీకి అందిన సమాచారం. దీంతో ఆయన ఆదివారం రాత్రి ఒకేసారి భారీగా పోలీసులను మోహరింపజేసి అణువణువూ జిల్లాలోని ముఖ్యంగా తిరుపతి నగరంలోని రద్దీ ప్రాంతాలతోబాటు స్టే హోమ్స్, స్టార్ హోటళ్ళు, లాడ్జీలు ,ఓ మోస్తరు లాడ్జిలే టార్గెట్ చేసుకుని నిశితంగా తనిఖీలు చేపట్టారు. గదుల్లో ఉంటున్న వారెవరు, ఎక్కడ నుండి వచ్చారు. ఎందుకు వచ్చారనే వివరాలను రాబట్టారు. ఓవైపు సిసికెమెరాలలో పర్యవేక్షిస్తూ మరో వైపు డ్రోన్‌కెమెరాలతో నిఘా ఉంచారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ముమ్మరం చేశారు. చివరకు బస్టాండ్‌లలో ఉన్న అనుమానితులైన ప్రయాణికుల వివరాలు కూడా పోలీసులు పరిశీలించడం విశేషం. ప్రజల భద్రత కోసం తనిఖీలు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

# పేద పిల్లల చదువుకు ప్రైవేటు గేట్లు బంద్!

**తిరుపతి జిల్లాలో కాగితాలకే పరిమితమైన విద్యాహక్కు**
**25 శాతం ఉచిత సీట్ల నిబంధనకు కార్పొరేట్ అడ్డుగోడలు**
**కొత్త విద్యాసంవత్సరం మొదలవుతున్నా అంతుచిక్కని అడ్మిషన్ల ప్రక్రియ**
**కోర్టు ఆదేశాలూ బేఖాతరు.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ శూన్యం**

తిరుపతి విద్య జూన్ 14 ప్రభాతవార్త

పేద, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలనే ఆశయంతో తెచ్చిన విద్యాహక్కు (ఆర్టీఈ) చట్టం తిరుపతి జిల్లాలో అభాసుపాలవుతోంది. చట్ట పుస్తకాల్లో నిబంధనలు ఘనంగా ఉన్నా.. క్షేత్రస్థాయిలో అమలు మాత్రం శూన్యంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడి గంటలు మోగనే మోగాయి . సమయం ఆసన్నమవడంతో.. తమ పిల్లలకు చట్టబద్ధంగా దక్కాల్సిన ఉచిత సీట్ల కోసం వేలాది మంది పేద తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్ల చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదు.

**చట్టం ఒకటి... అమలు శూన్యం!**

2009లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల వయసున్న ప్రతి బాలబాలికకు ఉచిత, నిర్బంధ విద్య అందించాలి. ఇందులో భాగంగా ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల తమ ఎంట్రీ లెవెల్ ప్రవేశాల్లో 25 శాతం సీట్లను నిరుపేదలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించి, ఉచితంగా విద్యను అందించాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలు ఈ నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయని విద్యార్థుల తల్లితండ్రులు మండిపడుతున్నారు .

**అర్హులైనా దక్కని ప్రవేశాలు..**

నిబంధనల ప్రకారం అనాథలు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యర్థులు ఈ 25 శాతం ఉచిత కోటాకు అర్హులు. కానీ, జిల్లాలోని మెజారిటీ ప్రైవేటు యాజమాన్యాలు ఈ కోటా గురించిన సమాచారాన్ని బోర్డులపై ప్రదర్శించడం లేదు సరేకదా.. దరఖాస్తులు తీసుకోవడానికి కూడా నిరాకరిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. అడిగిన వారికి రకరకాల సాంకేతిక కారణాలు చెప్తూ వెనక్కి పంపుతున్నట్లు తెలుస్తోంది.

**నిర్వీర్యమవుతున్న సామాజిక న్యాయం..**

తిరుపతి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో గుర్తింపు పొందిన ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. వీటిలో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. చట్ట ప్రకారం లెక్కిస్తే వేలాది మంది పేద పిల్లలకు ఈ స్కూళ్లలో ఉచితంగా సీట్లు లభించాలి. కానీ, వాస్తవంగా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య వందల్లో కూడా లేకపోవడం గమనార్హం. గతంలో న్యాయస్థానాలు సైతం ఆర్టీఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించినా, విద్యాశాఖ అధికారుల ఉదాసీనత వల్లే కార్పొరేట్ శక్తులు కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నాయని విద్యా హక్కు ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు.




**ప్రభుత్వం దృష్టి సారించేనా..?**

విద్యాసంవత్సరం ప్రారంభం అయ్యింది. ఈసారైనా తమ పిల్లలకు పెద్ద చదువులు అందుతాయా లేదా అని పేద కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ విద్యాసంవత్సరం కూడా ఈ చట్టం కాగితాలకే పరిమితం కాకుండా ఉండాలంటే, విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని, ప్రవేశాల ప్రక్రియపై ప్రత్యేక పర్యవేక్షణ పెట్టి నిబంధనలు ఉల్లంఘించే స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

## టాప్ 10లో చిత్తూరు ఎమ్మెల్యే 'గురజాల'

### - ఎమ్మెల్యేల పనితీరులో దక్కిన అరుదైన గౌరవం
### - గురజాల జగన్‌మోహన్‌కు అభినందనల వెల్లువ

చిత్తూరురూరల్, జూన్ 14 ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ పదిమంది ఎమ్మెల్యేల్లో మొదటిసారి ఎమ్మెల్యేగా నిలిచి గెలిచిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌కు అరుదైన గౌరవం దక్కడంతో తెదేపా, కూటమి పార్టీ నాయకులు, అభిమానులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేసారు. ఆదివారం ఎమ్మెల్యే స్వగృహంలో అభిమానులు టాప్ 10లో నిలిచిన ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చేత కేక్ కట్‌చేయించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రధానంగా సూపర్‌సిక్స్ హామీల అమలు, రాష్ట్రం నలుమూలల ప్రైవేట్ కంపెనీలు, ప్రత్యేక కార్పొరేట్ సంస్థల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన అంశాలను వివరించారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమపాలన అందిస్తోందన్నారు. చిత్తూరు నగరంలో గతంలో ఎన్నడూ లేనంతంగా అభివృద్ధిపనులు జరుగుతున్నాయని, ప్రధానంగా ఆరు ప్రధాన రహదారుల విస్తరణ అభివృద్ధి పనులు వేగంగా జరుతున్నాయనీ, ఎన్ని ఆటంకాలు ఎదురైనా నగరంలోని ప్రధాన రోడ్లన్నింటినీ విస్తరించి అభివృద్ధి చేస్తామన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం కనీసం గుంతలు కూడా పూడ్చలేదని, కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రోడ్లను బాగు చేసిందన్నారు. చిత్తూరురూరల్ మండలం వెంకటాపురంలో ఇండస్ట్రీయల్ భాగంగా పలు కంపెనీలు ప్రారంభమయ్యాయనీ, రానున్న రోజుల్లో చిత్తూరులో మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. చివరగా చిత్తూరును అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యేకు మీడియా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# సైనిక్, నవోదయ ఫలితాల్లో విశ్వం జాతీయ స్థాయి రికార్డు

**తిరుపతి విద్య జూన్ 14 ప్రభాత వార్త**



సైనిక్ స్కూల్, నవోదయ విద్యాలయాలు, మిలిటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్షల శిక్షణలో దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందిన తిరుపతిలోని విశ్వం విద్యా సంస్థలు 2026 ఫలితాల్లో మరోసారి అద్భుత విజయాలతో తమ ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాయి. 2026 ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రథమ ర్యాంకులను సాధించడంతో పాటు, మొత్తం 59 మంది విశ్వం విద్యార్థులు సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాలకు అర్హత సాధించారు. అదేవిధంగా, ఈ ఏడాది నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో ఏకంగా 63 సీట్లను కైవసం చేసుకుని సంచలన విజయాన్ని నమోదు చేశారు. ఈ విజయాల నేపథ్యంలో తిరుపతిలోని వరదరాజనగర్‌లో గల విశ్వం సైనిక్-నవోదయ పోటీ పరీక్షల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు తల్లిదండ్రులు, విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ... సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలకు, వ్యక్తిత్వ వికాసానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. గత 36 సంవత్సరాలుగా విశ్వం విద్యా సంస్థలు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ వల్లే ప్రతి ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అగ్రస్థానాలను సాధిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది విద్యార్థులు సాధించిన అత్యుత్తమ ప్రతిభ రాష్ట్ర విద్యారంగానికే గర్వకారణమన్నారు. వయోపరిమితి ప్రకారం 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షలకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నాపత్రాలు, మాక్ టెస్టులు, ప్రత్యేక కోచింగ్, అడ్మిషన్ల పూర్తి వివరాలను తల్లిదండ్రులు తెలుసుకొని తమ పిల్లల భవిష్యత్తుకు సరైన ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల శిక్షణ వివరాల కోసం వరదరాజనగర్‌లోని విశ్వం కేంద్రంలో లేదా 86888 88802, 93999 76999 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో ప్రవేశం పొందే ఈ అరుదైన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకోవాలని డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## గిరిజనుల విద్యాభివృద్ధికి ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్ తెచ్చాం

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్.

**బుచ్చినాయుడు కండ్రిగ జూన్ 14 ప్రభాతవార్త**



గిరిజనుల విద్యాభివృద్ధికి యుపిఏ ప్రభుత్వ పాలనలో ఏకలవ్య ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ ను బుచ్చినాయుడు కండ్రిగ , కనమనంబేడు గ్రామంలో ఏర్పాటు చేశామని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా ప్రమాణాలు గురించి ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చింతామోహన్ విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఎస్సీలు, ఎస్టీలకు ఇచ్చిన ప్రాధాన్యతలో భాగంగా, ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఏర్పాటు చేశామన్నారు. బుచ్చి నాయుడు కండ్రిగ మండలంలో ఎస్టీల జనాభా ఎక్కువగా ఉందన్నారు. ఎస్టీలను గొప్ప విద్యావంతులుగా చేయాలనే దృఢ సంకల్పంతో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ కృషితో సాధించామన్నారు. నేడు 500 మంది ట్రైబల్ స్టూడెంట్స్ ఇక్కడ సిబిఎస్ సిలబస్ చదువుకుంటున్నారని, వీరిలో సుమారు 250 మంది గిరిజన బాలికలు, 250 మంది గిరిజన బాలురు ఉన్నారని తెలిపారు. 30 మంది అధ్యాపకులు మంచి విద్యను బోధిస్తున్నారని ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల నుంచి రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, హర్యానా నుంచి 30 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు. ఏకలవ్య ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ లో ఒకటి నుంచి, 12వ తరగతి వరకు విద్య అందుబాటులో ఉందన్నారు. ఇక్కడి విద్యార్థులు బాగా చదువుకుని, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి ఘనమైన ప్రగతికి కృషి చేసిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అన్నారు. త్వరలో కేంద్ర ట్రైబల్ వెల్ఫేర్ మంత్రిని తీసుకొస్తామన్నారు. నిధులు కొరత ఉందని, ఇక్కడి అధ్యాపకుల ద్వారా తెలిసిందన్నారు. అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర నాయుడు, ప్రిన్సిపల్, మరియు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన గంగమ్మ జాతర



**బుచ్చి నాయుడు కండ్రిగ జూన్14 ప్రభాతవార్త**

నీర్పాకోట గ్రామంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గంగమ్మ జాతర వైభవంగా ప్రశాంతంగా పొంగళ్ళు పూలు, పండ్లు, పలహారాలకు గంగమ్మకు సమర్పించి భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ప్రతి ఇంటి నుంచి పొంగళ్ళు సమర్పించి ప్రజలు భక్తిశ్రద్ధలతో ఐక్యమత్యంగా పూజా కార్యక్రమంలో నిర్వహించి వారి కృప కటాక్షములను పొందగలిగారు. పొంగళ్ల ఊరేగింపులో విద్యుత్ దీపాల అలంకారాల శోభలో మంగళ వాయిద్యాలు వాయిస్తూ పండితుల సమక్షంలో పూజలు వివసించి వైభవంగా గంగమ్మ జాతర జరుపుకోవడం జరిగింది. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు.

## కోడూరు-తిరుపతి అదనపు బస్సులు వేయండి సారూ...



**రైల్వేకోడూరు రూరల్, జూన్ 14 ప్రభాతవార్త**

రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలిపిన సందర్భంలో బస్సుల రద్దీ విపరీతంగా పెరిగిపోయిందని, స్థానిక ప్రయాణికులు తిరుపతికి వెళ్లాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు పడుతున్నారు. ముఖ్యంగా కోడూరు నుండి తిరుపతికి వెళ్లాలంటే రద్దీతో బస్సులు ఆపకుండా వెళుతుంటే ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతమని కోడూరు పట్టణ ప్రజలు ఎన్నో ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేసినప్పటి నుండి తిరుపతి ప్రాంతంలో ఉన్న గుడులకు, షాపింగ్‌లకు వెళుతుంటే మగ ప్రయాణికుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ప్రస్తుత కూటమి నాయకులు కోడూరు నుండి తిరుపతికి వెళ్లేందుకు అదనపు బస్సులను ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని కొంతమంది ప్రయాణికులు బహిరంగంగా పేర్కొంటున్నారు. తిరుపతి పట్టణము అత్యంత ముఖ్యమైన ప్రదేశము అయినందున హాస్పిటలకు వెళ్లాలన్నా, గుడులకు వెళ్లాలన్నా ఎన్నో కష్టాలు ఎదురవుతుంటాయని, పూర్తిగా ప్రయాణికులు పరిస్థితి అర్థం చేసుకొని ఆర్టీసీ ఉన్నత అధికారులు రైల్వే కోడూరు నుండి తిరుపతికి అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని కోడూరు ప్రజలు కోరుకుంటున్నారు.

## నేడు మంగంపేటకు ఈ.డి, డిడిఎంఎస్ అధికారులు రాక




**ఓబులవారిపల్లి, 14 జూన్ ప్రభాతవార్త**

మంగంపేట ఏపీఎండిసి సంస్థకు సంబంధించిన ఈ.డి మరియు డిడిఎంఎస్ అధికారులు సోమవారం మంగంపేటకు.రానున్నట్లు సమాచారం అక్కడ మిల్లులు ఎంక్వయిరీ కేంద్ర ప్రభుత్వ సంస్థకు సంబంధించిన ఓఎన్జిసి కంపెనీ విల్లులకు సంబంధించి నాసిరకం ముగ్గురాయి పౌడర్ ను ఎగుమతి చేశారని అవకతవకలపై. వస్తున్నట్లు తెలుస్తోంది మిల్లులు మరియు ముగ్గురాయి పౌడర్ ను తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న విషయాలను పరిశీలించినట్లు విశ్వసనీయ సమాచారం ఏది ఏమైనా అధికారులు పరిశీలనలో ఎంత గ్రావిటీ పౌడర్ను సప్లై చేస్తున్నారు తదితర విషయాలపై విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది .

## ఎస్వీయూలో డ్రైవింగ్ స్కూల్ వాహనాలపై నిషేధం విధించాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్



**తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాతవార్త**

ఎస్వీయూ ఆవరణలో బయటి వ్యక్తుల రాకపోకలు, అనధికారిక కార్యకలాపాలు మితిమీరిపోతున్నాయని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టపగలే యూనివర్సిటీలోని ప్రకాశం భవనం ఎదుట ఎటువంటి అనుమతులు లేకుండా ఒక ప్రైవేట్ డ్రైవింగ్ స్కూల్ వాహనంలో దాదాపు పది మంది యువతకు డ్రైవింగ్ శిక్షణ ఇస్తుండటాన్ని గమనించిన ఎస్ఎఫ్ఐ నాయకులు ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులకు, విద్యార్థి నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. యూనివర్సిటీలోని కొందరు ప్రొఫెసర్లు, ఉద్యోగుల అండదండలతోనే తాము అనుమతులు లేకుండా ఇక్కడ శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొనడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. అనంతరం విద్యార్థి నాయకుల సమాచారంతో సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకుని, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను హెచ్చరించి వెనక్కి పంపించి వేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి. అశోక్ కుమార్, సహాయ కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ... యూనివర్సిటీలో కొందరు అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ బయటి వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తున్నారని, డ్రైవింగ్ స్కూళ్లను అనధికారికంగా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. గత వారం ఇదే డ్రైవింగ్ స్కూల్‌కు చెందిన ఒక వాహనం హోమ్ సైన్స్ పీజీ విద్యార్థినిని ఢీకొట్టి వెళ్లిపోయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అధికారులు విద్యార్థుల సంక్షేమాన్ని వదిలేసి వ్యక్తిగత పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ఇకపై క్యాంపస్‌లోకి డ్రైవింగ్ స్కూల్ వాహనాలు ప్రవేశించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వాహనాలను అడ్డుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

## మంచినీటి సంపు ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ



**విజయపురం, జూన్ 14 ప్రభాతవార్త:**

మండలంలోని ఇళ్ళత్తూరు సమీపంలో కుశస్థలీనది ఒడ్డున మంచినీటి నిల్వ కోసం లక్ష లీటర్ల కెపాసిటీ గలసంపు ట్యాంకు నిర్మాణానికి ఆదివారం ఎంపీపీ లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు సుమారు 30 ఏళ్లుగా రాజీవ్ టెక్నాలజీ మిషన్ మంచినీటి పథకం ద్వారా కుశస్థలీనదిలో బోరు బావులు తవ్వి విద్యుత్ మోటార్లు అమర్చి, పైపులైన్ల ద్వారా మంచినీటిసరఫరా చేస్తున్నారు. ఇటీవల కాలంలో డైరెక్ట్ పంపింగ్ వల్ల పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురవుతుందని, పైపు లైన్లు మరమ్మతులకు గురైనప్పుడు బోరు బావులకు అమర్చిన మోటార్లు బంద్ చేసి మరమ్మతులు చేయాల్సి ఉంది. దీని వల్ల మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. మంచినీటిసరఫరాకు ప్రత్యామ్నాయంగా సంపు ట్యాంకు నిర్మించ తలపెట్టినట్లు ఆయన తెలిపారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులకు, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకుపోగా 10 లక్షల రూపాయలు నిధుల మంజూరు చేయించినట్లు తెలిపారు. భూమిపూజ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌రాజు, బాబుయాదవ్, పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, ఏళుమలై తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా ఊట ధ్వంసం



**విజయపురం, జూన్ 14 ప్రభాతవార్త:**

చిత్తూరు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు ఆదివారం విజయపురం మండలం ఇళ్ళత్తూరు గ్రామ పరిధిలో కార్డెన్ సర్చ్ నిర్వహించి ఇళ్ళత్తూరు గ్రామ చెరువులో నాటుసారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన సుమారు 400 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఇందులో విజయపురం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, కానిస్టేబుళ్లు కేశవ, సతీష్ కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నాటుసారా తయారీ, విక్రయం నేరమని, పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ఆరవ బాలాజీకి జన్మదిన వేడుకలు

**పుత్తూరు రూరల్, జూన్ 14 ప్రభాతవార్త:**



పుత్తూరు రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆరవ బాలాజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రూరల్ ప్రధాన కార్యదర్శి హేమంత్‌కుమార్,మాజీ ఎంపీటీసీ కోట గజపతి, ఐ టీడీపీ కో-ఆర్డినేటర్ ఈశ్వర్‌యాదవ్, చిత్తూరు పార్లమెంట్ ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి చెంచయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉమాశంకర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీనాయకులు వి.శరవణ, తొరూరు గ్రామ కమిటీ అధ్యక్షులు మునీంద్రరెడ్డి, మోహన్, ప్రకాష్, యాటోనీ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్‌లో కుమార మంగళం బిర్లా జన్మదిన వేడుకలు

పేదలకు అన్నదానం, వస్త్రదానం చేసిన నిర్వాహకులు



**తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాత వార్త**

ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ డాక్టర్ కుమార మంగళం బిర్లా జన్మదిన వేడుకలు ఆదివారం తిరుపతిలో సేవా కార్యక్రమాలతో ఘనంగా జరిగాయి. గాంధీ రోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయంలో, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి. రాయలు ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఏ. మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాయకులు, నిర్వాహకులు కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేయడంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ జన్మదినాన్ని పురస్కరించుకొని ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 1,000 మంది నిరుపేదలకు వినూత్నంగా అన్నదానం, వస్త్ర దానం కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి. రాయలు మాట్లాడుతూ... డాక్టర్ కుమార మంగళం బిర్లా దూరదృష్టి కలిగిన అద్భుతమైన పారిశ్రామికవేత్త అని కొనియాడారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో ఆదిత్య బిర్లా గ్రూప్ ప్రపంచవ్యాప్తంగా 48 దేశాలకు విస్తరించి, రెండు లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించిందని గుర్తుచేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో మహాత్మా గాంధీకి బిర్లా కుటుంబం అందించిన ఆర్థిక, నైతిక సహాయ సహకారాలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. గత పదేళ్లుగా కుమార మంగళం బిర్లా జన్మదినాన్ని కస్తూర్బా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి మధుసూదన్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు, సిబ్బంది , స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

ఫోర్టో డిమాండ్



**తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాత వార్త**

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ ( ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నిబంధన నుండి తక్షణమే మినహాయింపు ఇవ్వాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్ డిమాండ్ చేసింది. ఫోర్టో రాష్ట్ర శాఖ సూచనల మేరకు ఆదివారం తిరుపతి పట్టణంలోని టీపీపీఎం ఉన్నత పాఠశాలలో ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫోర్టో జిల్లా చైర్మన్ దొడ్డ ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వక్తలు పాల్గొని టెట్ నిబంధనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించి, వారికి పూర్తి ఉద్యోగ భద్రత, పదోన్నతులపై ప్రభుత్వం తక్షణమే భరోసా కల్పించాలని కోరారు. సదస్సులో ఫోర్టో జిల్లా చైర్మన్ దొడ్డ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 309 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తనకున్న ప్రత్యేక అధికారాలను వినియోగించి, 2010 కంటే ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు టెట్ నిబంధన వర్తించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సైతం విద్యా హక్కు చట్టంలో తక్షణమే సవరణలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా బోధనా అనుభవం కలిగి, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని కేవలం ఒక అర్హత పరీక్షతో కొలవాలని చూడడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఉమామహేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, తద్వారా విద్యార్థుల భవిష్యత్తును, ఉపాధ్యాయుల మనోస్థైర్యాన్ని కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన సదస్సులో ఫోర్టో ప్రముఖ నాయకులు ఆర్. తులసీరామ్, పి. కాటయ్య, కె. వాసుదేవయ్య, పి. గిరిబాబు, ఆర్. స్వర్ణలత, టి. సుబ్రహ్మణ్యం , స్థానిక ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుపతి మలబార్ గోల్డ్‌లో ఆర్టిస్ట్రీ జ్యువెలరీ షో ప్రారంభం

**తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాత వార్త**



ప్రముఖ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తిరుపతి షోరూంలో ఆర్టిస్ట్రీ - బ్రాండెడ్ జ్యువెలరీ షో ఘనంగా ప్రారంభమైంది. జూన్ 12 నుండి జూన్ 22 వరకు సాగే ఈ ప్రత్యేక ఆభరణాల ప్రదర్శనను షోరూం కస్టమర్లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఆర్ట్ ఇన్ ఎవరీ జ్యువెలరీ అనే సందేశంతో, ఆభరణాల తయారీలో హస్తకళల నైపుణ్యం , ఆధునిక డిజైన్‌ల సమ్మేళనంగా ఈ షోను రూపొందించినట్లు షోరూం హెడ్ రిజేష్ , ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రదర్శనలో మలబార్ సంస్థకు చెందిన ప్రముఖ బ్రాండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మైన్ వజ్రాభరణాలు, ఎరా అన్కట్ వజ్రాల డిజైన్లు, ప్రెష్యా జాతిరత్నాభరణాలతో పాటు ఎత్నిక్స్ సంప్రదాయ నమూనాలు, జోల్ తేలికపాటి ఆభరణాలు, ఆధ్యాత్మికత ఉట్టిపడే డివైన్ శ్రేణి , చిన్నారుల కోసం స్టార్లెట్ కలెక్షన్లను వినియోగదారుల కోసం అందుబాటులో ఉంచారు. ప్రదర్శనను పురస్కరించుకుని వినియోగదారులకు ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించారు. అన్ని బంగారు, అన్కట్, జాతిరత్నాభరణాల తరుగు (వీ ఏ ) చార్జీలపై 30 శాతం వరకు తగ్గింపుతో పాటు, వజ్రాభరణాల వజ్రాల విలువపై కూడా 30 శాతం వరకు ప్రత్యేక డిస్కౌంట్ అందిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. నాణ్యత, నైపుణ్యంతో కూడిన ఈ సరికొత్త ఆభరణాల కలెక్షన్లను, రాయితీలను తిరుపతి నగర ప్రజలు, ఆభరణాల ప్రియులు సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తిరుపతిలో మంచినీళ్ళగుంట శుభ్రతకు స్వచ్ఛంద ఆపరేషన్



**తిరుపతి,జూన్ 14ప్రభాతవార్త:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం మంచినీళ్ల గుంట (నరసింహ తీర్థం) శుభ్రత కార్యక్రమాన్ని కొనసాగించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష రామకృష్ణ ఆధ్వర్యంలో వడ్డిపర్తి పద్మాకర్ శిష్య బృందం "గుడిబడి" వాలంటీర్ల సహకారంతో గత వారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో చెరువు ఒడ్డున పేరుకుపోయిన రాళ్లు , చెట్ల కొమ్మలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ,చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా అనూష రామకృష్ణ మాట్లాడుతూ, తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయానికి తీసుకెళ్లే నీరు ఈ మంచినీళ్ల గుంట నుంచే సేకరిస్తున్నందున, ఈ పవిత్ర జలాశయాన్ని కాలువ మురుగునీరు కలుషితం కాకుండా కాపాడేందుకు మున్సిపల్ కార్పొరేషన్ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ఈ జలాశయాన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

## గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా



సూళ్ళూరుపేట, జూన్ 14 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా, సూళ్ళూరుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ ఆధ్వర్యంలో సూళ్ళూరుపేట, తడ మండలాల్లో లాడ్జీలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా సూళ్ళూరుపేట పరిధిలో 19 లాడ్జీలు, తడ మండలంలో 10 లాడ్జీలను వెరసి మొత్తం 29 లాడ్జీలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సూళ్ళూరుపేట ఎస్సై అజయ్ కుమార్, సుబ్రహ్మణ్యం రాజా,తడ ఎస్సై కె.కొండప్ప నాయుడు, దొరవారిసత్రం ఎస్సై జి.వి. చౌదరి, శ్రీహరికోట ఎస్సై బి. భాను ప్రసన్న, ఆయా స్టేషన్ల కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ ఎం. మురళీకృష్ణ మాట్లాడుతూ లాడ్జీల ముసుగులో గంజాయి స్మగ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



సూళ్లూరుపేట, జూన్ 14 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని లైన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ వారిఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నాగేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చెన్నై శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ కార్యక్రమంలో భాగంగా చెన్నై నుంచి వచ్చిన ప్రముఖ నేత్ర వైద్యులు శిబిరానికి హాజరైన రోగులకు కంటి పరీక్షలు నిర్వహించివారిలో అవసరమైన వారికి శాస్త్ర చికిత్సలు చేయించేందుకు చెన్నైకు తీసుకువెళ్లారు. లైన్స్ క్లబ్ సభ్యులు మధుసూదన్ రెడ్డి,అప్పారావు, ఆదిశేషారెడ్డి దాతృత్వంతో నిర్వహించిన శిబిరాన్ని స్థానిక సీఐ ఎం మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చెందిన డాక్టర్ ఆదిశేషారెడ్డి, లలిత, అరుణ కుమారి, జానకి, కాళంగి ప్రభాకర్, తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, ఆర్ఎంవి భాస్కర బాబు, ఎస్ హరీష్, జె. శ్రీనివాస్, శివకుమార్, మురళీధర్, రాధాకృష్ణ రావు, తదితరులు పాల్గొన్నారు.

## సంతానోత్పత్తి వైద్య శిబిరం ప్రారంభోత్సవం



నాయుడుపేట, జూన్ 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ థామస్ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం నాయుడుపేట పట్టణంలోని కె.కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఉచిత సంతానోత్పత్తి వైద్య శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ థామస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్రెడ్డి, పోట్లపూడి రాజేష్,అవధానం సుధీర్, నిత్యా కృష్ణారెడ్డి, జువ్వలపాటి మస్తాన్, కాపులూరు చక్రపాణి, ఆకుల కుబేరు మణి, పలుకూరు ముత్యాలయ్య, వినుకొండ ధనంజయ, బల్లి ముత్యాలయ్య, చేవూరు చెంగయ్య పలువురు నాయకులు ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ థామస్కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి, సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఐఐఐటికి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు





వెంకటగిరి, జూన్ 14 ప్రభాతవార్త: ఏపీ మోడల్ స్కూల్కు చెందిన ఏడు మంది విద్యార్థిని విద్యార్థులు నూజివీడు ఒంగోలులోని ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తులసి జ్యోతి తెలిపారు. కే ముని పూజిత, ముని జస్వంత్, టి రాజా, పరమేష్ నూజివీడు ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఆదిత్య, వర్షిని, గురుప్రియ ఒంగోలు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఏడు మంది విద్యార్థిని విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపి కావడం పట్ల విద్యార్థులను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

## రుద్రకోట కుటుంబాన్ని పరామర్శించిన నేదురుమల్లి



వాకాడు, జూన్ 14 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు బజారు వీధిలో రుద్రకోట లక్ష్మిదేవమ్మ ఇటీవల మృతి చెందింది. ఆదివారం వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి నేదురుమల్లి రామ్కుమార్రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు భరోసాగా అండగా తాను ఉన్నారని అధైర్య పడు ద్దని అన్నారు, ఎంతసేపు కుటుంబ సభ్యులతో రామ్ కుమార్రెడ్డి మాట్లాడారు. ఆయన వెంట వాకాడు మాజీ ఉపసర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్రెడ్డి, హిమ కుమార్రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, సుధాకర్రెడ్డి, వాకాటి రవికుమార్, రుద్రకోట సాయికుమార్, రుద్రకోట భీమేశ్వరావు తదితరులు ఉన్నారు.

## గ్రామాన్ని శుభ్రం చేసిన సమితి నిర్వాహకులు



బాలాయపల్లి, జూన్ 14 ప్రభాతవార్త: విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించడమే సత్యసాయి సేవా సమితి లక్ష్మణి నిర్వాహకులు తెలిపారు. భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఆదివారం ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో ఒక మందిరంలో ఆ మందిరాన్ని పరిశుభ్రం చేయుట, చుట్టుపక్కల మొక్కలు నాటు కార్యక్రమం, అటు తర్వాత భజన, సత్సంగము కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా మన వెంకటగిరి సత్యసాయి సేవా సమితి సంస్థ వారు బాలాయపల్లి మండలం మల్లెమాల గ్రామాల్లో మంది రంలో పరిశుభ్రత కార్యక్రమం, అక్కడ చెట్లు నాటే కార్యక్రమం, భజన సత్సంగ, కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామ్మోహన్, సత్యసాయి సేవా సమితి సభ్యులు అందరూ కూడా పాల్గొన్నారు.

## వీధి దీపాలు లేక చీకట్లో పార్కు వీధి



నాయుడుపేట, జూన్ 14 ప్రభాతవార్త : పట్టణంలోని పార్క్ వెనుక వీధిలో రెండు నెలలుగా వీధిలో దీపాలు వెలగక పోవడంతో ఇటు స్థానికులు అటు పాద చారలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. మేనకూరు సెజ్కు అధిక సంఖ్యలో వెళ్లే భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు,ఆటోలు ఈ మార్గం వెంట ప్రయాణిస్తుంటాయి. రెండు నెలలుగా పార్క్ వెనక వీధిలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో స్థానిక ప్రజలతో పాటు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో 2 నెలలుగా వీధి దీపాలు వెలగక పోవడంతో స్థానికులు మున్సిపల్ అధికారులకు అనేక పర్యాయాలు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పార్కు వెనక వీధిలో విద్యుత్ దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రాష్ట్ర సర్వే ఉపాధ్యక్షులుగా చరణ్



నాయుడుపేట, జూన్ 14 ప్రభాతవార్త : నియోజకవర్గం నాయుడుపేట తహసిల్దార్ కార్యాలయంలో సర్వేర్గా విధులు నిర్వహిస్తున్న బాణాల చరణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వే ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాయుడుపేట ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర సర్వే ఉపాధ్యక్షులు అయిన బాణాల చరణ్కి పలువురు ఎంఈఎఫ్ నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఆయనను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. చరణ్ నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వే ఉపాధ్యక్షులుగా నియమితులవడం సంతోషదాయక మని ఎంఈఎఫ్ నియోజకవర్గం అధ్యక్షులు జడ చలపతి, ఎంఈఎఫ్ గౌరవ అధ్యక్షులు పాలేటి చంద్రయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండాపురం సీనయ్య, ఎం ఈ ఎఫ్ ప్రధాన కార్యదర్శి గంగిపంగి శ్రీనివాసులు, ట్రెజరర్ గంగిపంగి వీర రాఘవయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గోవిందు వాసు మాదిగ, సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు కుక్క మల్లి రవి మాదిగ, పెళ్లకూరు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఉచ్చూరు రవీంద్రనాథ్ మాదిగ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని చరణ్ మరి ఎంతో ఉన్నత స్థాయికి ఎదగాలని వారందరూ ఆకాంక్షించారు.

## తాగునీటి సమస్య పరిష్కారం

తడ, జూన్ 14 ప్రభాతవార్త: తడ మండలం వెండ్లూరుపాడు గ్రామంలో మూడు రోజులుగా నెలకొన్న త్రాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది ఎటికేలకు అధికారులు స్పందించి మరమ్మత్తులకు గురైన మోటార్ బదులుగా నూతన మోటార్ బిగించి త్రాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు త్రాగునీటి సమస్య మరల ఏర్పడకుండా మరో మోటర్ అందుబాటులోకి తీసుకొస్తామని ఎంపీడీవో శేఖర్ నాయక్ వెండ్లూరుపాడు గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎంఈఓ మల్లికార్జునరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్ తెలియజేశారు సకాలంలో స్పందించి త్రాగునీటి సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.

## నిడిగల్లు పీఏసీఎస్ను సందర్శించిన అప్కాబ్ ఎండీ, డీసీసీబీ సీఈవో



వెంకటగిరి, జూన్ 14 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా నిడిగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో అప్కాబ్ ఎండీ రామకృష్ణ గారు నెల్లూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సీఈవో శ్రీనివాసరావు ఆప్కాబ్ ఏజీఎం మనీషా, ఆదివారం సందర్శించారు. నిర్వహించారు. సంఘం కార్యాలయంలో రికార్డులు, సభ్యులకు అందిస్తున్న సేవలు, రుణాల పంపిణీ, వసూళ్ల ప్రక్రియ, రైతులకు అందిస్తున్న సహకార సేవలపై వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆర్థిక లావాదేవీలు, ఖాతాల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సహకార రంగం బలోపేతానికి సంఘాలు పారదర్శకంగా పనిచేయాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా సేవలను విస్తరించాలని అప్కాబ్ ఎండీ రామకృష్ణ పేర్కొన్నారు. డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు, బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. సహకార సంఘం పనితీరుపై అప్కబ్ ఎండి సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సంగం చైర్మన్ ఆది వెంకట కృష్ణారెడ్డి, డైరెక్టర్లు రాంబాబు, రామ్మోహన్, బ్రాంచ్ మేనేజర్ రమేష్, సూపర్వైజర్ గురునాథం, నారాయణ, సీఈవో మనమాస సిద్దేశ్ యాదవ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోవిందా...గోవింద

## వరుససెలవులతో భక్తజనసంద్రంగా ఏడుకొండలు

### -అఖిలాండం వద్ద కొబ్బరికాయలుకొట్టి వెనుదిరుగుతున్న సామాన్యభక్తులు



తిరుమల,జూన్ 14 ప్రభాతవార్తప్రతినిధి: దేశవ్యాప్తంగా వేసవి సెలవులు ముగియడం,పాఠశాలలు తెరచుకున్నా వరుసగా రెండురోజులు సెలవులు రావడంతో కలియుగవైకుంఠం తిరుమల భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం వేకువజామునకే తిరుమలలో వైకుంఠమ్ 1,2, క్యూకాంప్లెక్స్ కంపార్టు మెంట్లన్నీ భక్తులతో నిండిపోయి గోగర్భమ్డ్యామ్ వరకు ఐదుకిలోమీటర్లు ఆలయం వెలుపలకు చేరాయి. దీంతో సాధారణ సర్వదర్శనానికి 35గంటలు సమయంపైగానే భక్తులు దర్శనానికి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.భారీగా పెరిగిన భక్తులతో కొండంతా గందరగోళంగా మారింది.చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు క్యూలైన్లలో నిలబడే ఓపికలేక ఆలయం ముందు అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని వెనుదిరుగుతున్నారు. లడ్డూవితరణశాలలో భక్తులు బారులుతీరి నిలబడినా ఒక్కో భక్తునికి 4లడ్డూలు విక్రయిస్తున్నారు. వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు 20గంటలు దర్శనానికి పడుతుండగా వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులు కంపార్టుమెంట్లకు చేరుకునేందుకు మరో 15గంటలు సమయంపైగానే పట్టే సూచనలు ఉన్నాయి. భక్తులు క్యూలైన్లలో గోవిందా...గోవింద నామస్మరణ చేస్తున్నారు. ముందుగానే రద్దీని ఊహించిన టిటిడి అధికారులు భక్తులకు నిరంతరాయంగా శ్రీవారి సేవకులతో పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, కాఫీ,మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. భక్తులు కూడా సంయమనం పాటించాలని, తమ దర్శన సమయం వచ్చేవరకు ఓపికతో క్యూలైన్లలో సకల సౌకర్యాలు అందుకోవాలని టిటిడి అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, పర్యవేక్షిస్తున్నారు.

# వాయులింగేశ్వరుని దర్శనం కోసం జనం జాతర

### 52వేల మంది దర్శనం: 8వేల రాహుకేతుదోష నివారణ పూజలు
### - ఇసుకేస్తే రాలనంత జనం:సన్నిధి వీధిలో అగమ్యగోచరం




శ్రీకాళహస్తి,జూన్ 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం భక్తుల సునామి చోటు చేసుకుంది. దేవస్థానం అధికారులు అందించిన సమాచారం మేరకు దర్శనం చేసుకున్న భక్తులు 52వేలుగా వివరించారు. దాంతో నాల్గవ, మూడవ గేట్లు ఉన్న సన్నిధివీధి, దిగువ సన్నిధివీధుల్లో పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. వాహనాలతో కిట కిట లాడాయి.దీనికి తోడు ఆర్టిసి బస్సులు ఇదే మార్గంలో నడవటంతో ద్విచక్రవాహనాల దారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. దారి మళ్ళి పయనించాల్సిన స్థితి చోటు చేసుకుంది.

**ఒకటే జనం...జనం:**

తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయానికి రెండు రోజులుగా భక్తులు కదలి తరంగాల్లా కదలి వస్తున్నారు.వేసవిలో ఆలయానికి భక్తులు తండోపతతండాలుగా వస్తున్నారు.ఈ నేపధ్యంలో ఆదివారం ఆలయం భక్తులతో కిక్కిరిసింది.ఎటు చూసినా భక్త జనమే. ఎటు చూసినా వాహనాల రద్దీయే కనబడింది. వరుస సెలవులతో జిల్లాలోని ఆలయాలు కిట కిట లాడుతు న్నాయి. ఓ వైపు ఎండ మాడు పగల గొడుతున్నా లెక్క చేయక భక్తులు కదలి వచ్చారు. దాంతో వాయు లింగేశ్వరుని దర్శనం కోసం భక్త జనులు సతమతమయ్యారు.అధికారులు అందించిన సమాచారం మేరకు రాహుకేతుదోష నివారణ పూజలు ఎనిమిదివేలు దాటాయి. ఇక అభిషేకాలు 50దాటాయి. సాధారణ, ప్రత్యేక దర్శన టిక్కెట్లు ద్వారా సుమారు 8 వేలు దాటింది.

**పార్కింగ్ కోసం తిప్పలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల వాహనాలు పార్కింగ్ చేయటానికి సరైన సదుపాయం లేదు. సన్నిధివీధిలో ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ సదుపాయం కల్గించారు. కానీ ఎక్కడా నిలువ నీడ లేదు. ఎండలైతే తల మాడు పగలాల్సిందే. ఇలా భద్రత కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దేవస్థానం ముక్కుపిండి పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారు తప్ప వారికి కనీస సదుపాయాలే కల్పించాలనే ధ్యాస లేకపోవటం శోచనీయం. శనివారం ఉదయం నుంచి ఆలయానికి వచ్చిన ఇతర రాష్ట్రాల భక్తులు పడ్డ తిప్పలు వర్ణనాతీతం. ఆలయం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని శుకబ్రహ్మాశ్రమం వరకు కార్లుబారులు తీరాయి.

## ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ దరఖాస్తులు అందించండి

### -ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి



తిరుపతి కార్పొరేషన్, జూన్ 14 ప్రభాతవార్త: ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ దరఖాస్తులు అందించి, పూరించిన వాటిని జులై 14 లోపు సేకరించి ఆన్లైన్ చేయాలని 167 తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఓటర్ నమోదు, యోగాంధ్ర 2026, తల్లికి వందనం అంశాలపై అధికారులు, సూపర్ వైజర్లు, స్వర్ణ వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అత్యంత కీలకమైన ఎన్యుమరేషన్ ఫారం పంపిణీ కార్యక్రమం సోమవారం నుండి ప్రారంభం అవుతుందని తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు, సూపర్వైజర్లు మీ పోలింగ్ కేంద్ర పరిధిలోని బూతులెవల్ ఏజెంట్లతో సమన్వయం చేసుకొని ఇంటింటికి వెళ్లి ఆ కుటుంబంలోని ఓటర్లకు ఎన్యుమరేషన్ దరఖాస్తులను పంపిణీ చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియను ఒక వారంలో పూర్తి చేయాలని, అలాగే ఒక వారం తర్వాత ఓటరుచే నింపబడిన ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించాలని తెలిపారు. కనీసం మూడుసార్లు అయినా ఆ ఇంటిని సందర్శించి, ఎన్యుమరేషన్ ఫారమ్ నింపడంలో సందేహాలు ఉంటే సాయం అందించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని జులై 14 లోపల పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవన శైలి పెంపొంది ంచేందుకు నిర్వహిస్తున్న ఈ యోగాంధ్ర లో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని తెలిపారు. తల్లికి వందనం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కార్యదర్శులు తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. సహాయ ఓటర్ల నమోదు అధికారులు అమరయ్య, సురేష్ బాబు, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, రెవిన్యూ అధికారి సేతుమాదవ్, సెక్రటరీ శ్రీవిద్య, ఎన్నికల ఉప తాసిల్దారు సుధాకర్ నాయక్, ఏసిపిలు పార్వతి ప్రియ, మూర్తి, డీఎఫ్ఓ శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ మధు, తదితరులు ఉన్నారు.

## ప్రముఖ వైద్య నిపుణులచే స్విమ్స్లో ఉచిత సేవలు



తిరుపతి హెల్త్, జూన్ 14 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్), తిరుపతి నందు తిరుమల తిరుపతి దేవస్థానముల వారి శ్రీవారి వైద్య సేవలో భాగంగా జూన్ 17వ తేది నుండి జూన్ 19వ తేది వరకు ప్రముఖ వైద్య నిపుణులు తమ వైద్యసేవలను అందించనున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెం డెంట్ డా రామ్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డా. జి. రాజేంద్ర ప్రసాద్ స్విమ్స్ పిడియాట్రిక్స్ విభాగం నందు తమ అమూల్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించనున్నారు. అవసరమైనవారు డా. రమేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీడియాట్రిక్స్ విభాగం ను సంప్రదించి సేవలను వినియోగించుకోవచ్చు. డా.పద్మావతి చౌడేశ్వరి, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, ఇ.ఎస్.ఐ హాస్పిటల్, విశాఖపట్నం నుంచి శ్రీవారి వైద్య సేవలో భాగంగా స్విమ్స్ నందు జీర్ణకోశ, కాలేయ వ్యాధులకు సంబంధించిన ఉచిత వైద్య సేవలు అందించనున్నారు. అవసరమైనవారు డా.భార్గవ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడిసిన్ విభాగం, ఫోన్ నంబర్ 9246292829ను సంప్రదించి సేవలను పొందవచ్చు. తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శ్రీవారి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, జూన్ 14 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించ నున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ను వాట్సప్లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్కు పంపిస్తున్నా మన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా యోగా తరగతులు



తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాతవార్త: స్థానిక ఎస్.జీ.ఎస్. ఆర్ట్స్ కళాశాలలో తిరుమల తిరుపతి దేవస్థానం (తి.తి.దే.) యాజమాన్యం ఆదేశాల మేరకు ప్రతిరోజు యోగా తరగతులను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సత్యనారాయణ తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, తితిదే ఈఓ ముద్దాడ రవిచంద్ర, జేఈఓ శరత్ ల నేతృత్వంలో తితిదే పరిపాలనా భవనం వద్ద యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగానే ఎస్.జీ.ఎస్. ఆర్ట్స్ కళాశాలలో యోగా మాస్టర్ సి.వి. కృష్ణయ్య ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఈ క్లాసులకు కళాశాల ప్రిన్సిపాల్తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అందరూ విధిగా హాజరవుతూ నిత్యం యోగా సాధన చేస్తున్నారు.కాగా, యోగా సాధకులకు తితిదే హెల్త్ సెంటర్ నుండి నర్స్ ఎం.ఎస్. బిందును పిలిపించి, యోగాసనాలకు ముందు, ఆ తర్వాత బీపీ, పల్స్ రేటును పరీక్ష చేయిస్తున్నారు. కాగా, కళాశాలలో జరుగుతున్న ఈ యోగా తరగతుల గురించి తెలుసుకున్న ఎస్.జీ.ఎస్. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కూడా ఉత్సాహంగా తరగతులకు హాజరయ్యారు. తమకు కూడా యోగా శిక్షణలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు గాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సత్యనారాయణను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

## పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 14 ప్రభాతవార్త: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 15వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 08772227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.

## నాగలాపురం మండలంలో పూర్తిగా దెబ్బతిన్న నీటి పైపులు

### తాగునీటి పైపులైన్లను మరమ్మతు చేపట్టండి

నాగలాపురం, జూన్ 14 ప్రభాతవార్తం







నాగలాపురం గ్రామం వెస్ట్ హరిజనవాడలో తాగునీరు సమస్య చాలా తీవ్రంగా ఉందని, నీటిపైపులు తీవ్రంగా దెబ్బతినడంతో అనేక చోట్ల నీరు వృథాగా పోతుందని నాగలాపురం ఐఎఫ్టీయూ మండల కార్యదర్శి మురుగేషన్, గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగలాపురం వెస్ట్ హరిజనవాడలో దాదాపు సుమారు 22 ఏళ్లకు ముందు వేసిన పైపులైన్ ఇప్పటి వరకు ఎన్నోప్రభుత్వాలు మారినా కూడా ఈ పైపులైన్లు తుప్పు పట్టినా పైపులైన్లు మారలేదని, డ్రైనేజీ వాటర్తో కలిసిపోవడంతో కలుషితమైన నీటిని తాగుతున్న జనం వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా ఈ కూటమి ప్రభుత్వం కాని పని చేస్తున్న అధికారులు, ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీలు వెంటనే స్పందించి ఈ తాగునీరు సమస్యని ఈ డ్రైనేజీ కాలువలు మరమ్మతులు చేపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేషనల్కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షణ్ముగం, స్థానికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చిట్టత్తూరు కేంద్రంగా రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా



తొట్టంబేడు జూన్ 14 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలం ఇసుక, మట్టిమాఫీయాలకు కేంద్రంగా మారింది. ఎంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదంటే ఇందులో కీలకం ఎవరో ఎవ్వరికి అంతుపట్టడం లేదు. ఏ రాజకీయ పార్టీలు అధికారంలో ఉంటే ఆ పార్టీల మద్దతుతో మాఫీయా రెచ్చిపోతుందంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహించటం తప్ప ఏమి చేయలేని దుస్థితి. మట్టి మాఫీయా ఆగడాలకు అంతులేకుండా మారింది. వ్యవస్థలు నిర్వీర్యమైనా తమ సొంత లాబాలే తప్ప వ్యవస్థల గురించి పట్టించుకోవటం లేదు. ఈ ఆగడాలను చూసి చూసి చిరవకు మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన ఒరైతులు, ప్రజలు తిరగబడ్డారు. ఇసుక అక్రమరవాణా చేస్తున్న ట్రాక్టర్లను బంధించారంటే ప్రజల్లో ఎంత వ్యతిరేకత చోటు చేసుకుందో అర్థమౌతుంది.

**చిట్టత్తూరులో రెచ్చిపోతున్న మట్టి మాఫీయా:**

మండలంలోని శివనాధపాళెం గ్రామం చిట్టత్తూరు చెరువుల వద్ద ఉన్న ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి గ్రావెల్ మాఫియా ఆగడాలు రోజురోజుకు శృతిమించిపోతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా జెసిబిల సాయంతో ట్రాక్టర్లతో ఎర్రమట్టిని ఆక్రమంగా తరలిస్తూ లక్షలు సొమ్ముచేసుకుంటున్నారు. గత కొన్ని నెలలుగా ఈ ఆక్రమ తవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్న చూడిచూడనట్లు గాలికి వదిలేస్తున్నారు. ప్రభుత్వ భూములతో పాటు చెరువు పరివాహక ప్రాంతాల్లో సైతం లెక్కచేయకుండా లోతుగా తవ్వేయడంతో అదేమని ప్రశ్నిస్తే రాజకీయనాయకుల పేర్ల ప్రస్తావన తేవడం వంటి పనులను మాఫియా చేస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. అక్రమంగా తరలిస్తున్న మట్టి గ్రావెల్‌ను సమీప ప్రాంతాల్లోని వెంచర్లకు, ఇంటిస్థలాలకు, రియల్ఎస్టేట్ పనులకు కాంట్రాక్టు ప్రాతిపదికన గ్రావెల్ మాఫియా మాట్లాడుకుని వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆక్రమ రవణా పై రెవెన్యూ, మైనింగ్ సంబదిత అధికారులకు విన్నవించిన మిన్నకుండిపోతున్నారు. అధికారులను నిలదీస్తే రాజకీయనాయకుల ఒత్తిడికి తలొగ్గే పరిస్థితి ఏర్పడిందని వారు చేతులేతస్తున్నారు. అయితే ఇక్కడ స్థానిక శాసనసభ్యుల కుటుంబ వ్యక్తిగత పిఎ ఇదే గ్రామంలో ఉండటం విశేషం. అయిన ఇసుక గ్రావెల్ మాఫియాలు రెచ్చిపోతున్నారంటే ఏ స్థాయిలో మాఫియా జరుగుతుందో అంతుపట్టడం లేదు. జిల్లా అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఓటరు జాబితా ప్రక్షాళనకు అందరూ సహకరించాలి



వడమాలపేట, జూన్ 14 ప్రభాతవార్త:

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో అందరూ సహకరించాలని తహసీల్దార్ జరీనా తెలిపారు. 2026 ఓటరు జాబితా సవరణలో భాగంగా ఆదివారం రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్ల అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో అందరూ నిజాయితీగా తోట్పాడు అందించాలని చెప్పారు. సర్వే సిబ్బందికి ఆటంగం కలిగించకుండా తప్పు, ఒప్పులను పై స్థాయి అధికారులకు తెలియజేయాలని చెప్పారు. ఓటరు జాబితా సవరణలో పలు విధాలుగా దరఖాస్తులు ఉన్నాయని వీటి ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సిబ్బంది విధులు చేపడుతున్నారు. వీటిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఉన్నతాధికారులకు తెలియజేయాలని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అందరి సమక్షంలో బహిరంగంగా నిర్వహించబడుతుందని తెలిపారు. సమావేశంలో టీడీపీ, వైసీపీ బీఎల్ఏలో పాల్గొన్నారు

## సమాజసేవలో యువతరం సేవసమితి

శ్రీకాళహస్తి జూన్ 14 ప్రభాతవార్త




ప్రపంచరక్తదాతల దినోత్సవం సందర్భంగాస్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వహణ ద్వారా గడిచిన 12 సంవత్సరాలుగా విశిష్ట సేవలందిస్తున్న యువతరం సేవ సమితి శ్రీకాళహస్తి సంస్థకు ఎస్విఆర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(రుయా) తిరుపతి వారు ప్రశంసా పత్రాన్ని అందజేయడం గర్వకారణమని యువకిషోర్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సమాజంలో అత్యవసర పరిస్థితుల్లోరక్తం అవసరమైన నిరుపేద రోగులకు సహాయం అందించాలనే లక్ష్యంతో యువతరం సేవ సమితి నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ మానవతా సేవలో ముందజలో ఉందన్నారు. నేడు రక్తదానం చేసిన వారికి ప్రశంసపత్రాలను అందజేశారు.

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో...**

శ్రీకాళహస్తి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ప్రపంచరక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు జిల్లా సహాయకార్యదర్శి కోగిల. మునిచందు అన్నారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం అనేది అతున్నతమైన మానవసేవ అని నేటి సమాజంలో ఎటూ చూసిన ప్రమాదాలు సంభవించి రక్తంతో వివిధ రకాల శస్త్రచికిత్సలు అవసరం అవుతున్నాయన్నారు. మన రక్తం ఇచ్చినట్లయితే మన వల్ల ఓ నిండు ప్రాణాలను కాపాడటమే కాకుండా ఓ కుటుంబం సంతోషంగా బ్రతుకుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి గుమ్మడి మురళి యువత పాల్గొన్నారు.

## బూతు లెవెల్ ఏజెంట్లకు శిక్షణ తరగతులు

బుచ్చినాయుడు కండ్రిగ జూన్ 14 ప్రభాతవార్త




మ్తండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ కార్యాలయం నందు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు బూత్ లెవెల్ ఏజెంట్లకు ఎస్ ఐ అర్ ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం తాసిల్దారు అధ్యక్షతన ట్రైనింగ్ ఇచ్చి బాధితులు అవగాహన కార్యక్రమాలు జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇటువంటి పొరపాటు జరగకుండా సర్వే నిర్వహించాలని తరగతుల్లో చూసి ఇచ్చారు కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఆయా గ్రామ పంచాయతీల బూత్ లెవెల్ ఏజెంట్లు శిక్షణ తరగతుల అధికారులు పాల్గొనడం జరిగింది

## మధర్ థెరిసా ఆశ్రమంలో పిల్లలకు నోటుబుక్స్ పంపిణీ



నాగలాపురం, జూన్ 14 ప్రభాతవార్త:

ఏఎంసీ చైర్మన్ జాన్సన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలోని మదర్ థెరిస్సా అనాథ పిల్లల ఆశ్రమంలోని పిల్లలందరికి ఆహారంతో పాటు నోటు పుస్తకాలు, పెన్నుల వంటి విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పేద, విద్యార్థులు, అనాథ పిల్లలకు ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఏఎంసీ చైర్మన్ జాన్సన్ అక్కడ ఉన్నవారిని కోరారు. అలాగే ఇది ప్రజల నమ్మకాన్ని చూరగొన్న ప్రజల కోసం పనిచేసే మంచి ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు. మాజీ జిల్లా ఎస్సీ సెల్‌కార్యదర్శి, తెలుగుదేశం పార్టీనాయకులు, ఎం.ఎస్.రవి, జనసేన నాయకుల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## "స్వమాక్స్" వారిచే రక్తదాన శిబిరం

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం




చంద్రగిరి, జూన్ 14 ప్రభాతవార్త:

చంద్రగిరికి చెందిన స్వర్ణముఖీ మహిళా పరస్పర సహకార సంఘం (స్వమాక్స్) కార్యాలయ ఆవరణలో సిఈఓ సంగీతం విశ్వనాథ్ ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి ప్రసూతి ఆసుపత్రి వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంపై స్పందించిన స్వమాక్స్ సిబ్బందితో పాటు స్థానికులు 20 మంది రక్తదాతలు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ అన్నిదానాలలోకి రక్తదానం గొప్పదని అన్నారు. స్వమాక్స్ ఏర్పాటు చేసి 25 స ంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తమ సిబ్బందితో శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా వుందన్నారు. సమాజంలో స్వమాక్స్‌కు గల గౌరవం తమలో సామాజిక స్పృహ కలిగించి రక్తదాన శిబిరం ఏర్పాటుకు ప్రేరణగా నిలించిదన్నారు. ఈ క్రమంలో రక్తదానం చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పార్లపల్లి పరంధామ రెడ్డిని ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసన్న ఠాగూర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందులో అజయ్‌కుమార్, నరేష్‌కుమార్ నాయుడు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.దొరస్వామి, మన్సూర్, తదితరులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పవిత్ర, డాక్టర్ సౌమ్య, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణమూర్తి, సిబ్బంది కుమారి, ప్రమీల, స్వమాక్స్ సిబ్బంది ఎస్.రామనాథరెడ్డి, పి.సుబ్రమణ్యం, పి.అంజి, వెంకటేష్, బి.హరికృష్ణ, ఢిల్లీ, వినోద్, విజయ్ కుమార్, కె.హరి, తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి.!

సహాయ రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్ఓ) అమరేశ్వరి

చంద్రగిరి, జూన్ 14 ప్రభాతవార్త:



చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా "ప్రత్యేక సమగ్ర సవరణ" (సర్) కార్యక్రమాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సహాయ రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్ఓ) దుద్దెల అమరేశ్వరి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15 నుండి జూలై 14 వరకు సర్ 2026 కార్యక్రమాన్ని నిర్వహిస్తారని అన్నారు. బిఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్ళి రెండు ఎన్యూమరేషన్ పత్రాలను అందజేస్తారని, అందులో పొందుపరచిన వివరాలను పరిశీలించి తప్పులు ఏవైనా వున్నట్లయితే సవరించి, బిఎల్ఓలకు అందజేయాలన్నారు. ఒకే కుటుంబంలోని ఓటర్లను ఓటరు లిస్ట్‌లో ఒకే ప్రదేశంలో పొందుపరచడానికి అనుగుణంగా వుంటుందన్నారు. ముసాయిదా జాబితా ప్రచురించిన అనంతరం2026 జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు చిరునామా మార్పులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో సర్ కార్యక్రమం ముగుస్తుందన్నారు. 2026 జూలై 1 నాటికి 18 ఏళ్ళు పూర్తి అయ్యే నూతన ఓటర్లు బిఎల్ఓల నుండి ఫారమ్-6, డిక్లరేషన్ ఫారమ్ తీసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 58 పోలింగ్ కేంద్రాలకు 58 మంది బిఎల్ఓలు అందుబాటులో వుంటారని మరిన్ని వివరాలకు మీ బిఎల్ఓ సహాయం పొందాలని సూచించారు.

# తిరుపతి డివిజన్

## నేడు నారాయణవనం ఎంపిడిఓ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

నారాయణవనం, జూన్ 14 ప్రభాతవార్త :



సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం 10గంటలకు ప్రజా సమస్యల పరిస్కార వేదిక(గ్రీవెన్స్ డే)ను నిర్వహిస్తున్న సత్యవేడు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం విలేఖరుల సమావేశం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం 10గంటలకు జరిగే గ్రీవెన్స్ డేలో మండలంలోని ప్రజలతో పాటు రైతులు వారి వారి సమస్యలను వినతి రూపంలో సమర్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి డివిజన్ స్థాయి, మండల స్థాయి హాజరుకావడం వల్ల పరిస్కరించు కోవచ్చన్నారు. అనంతరం 10.30గంటలకు కీళగరం లే ఔట్‌ను సత్యవేడు శాసనసభ్యులు పరిశీలించడం జరుగుతుందని ఎంపిడిఓ అరుణ మరో ప్రకటనలో తెలిపారు. కావున పంచాయతీ రాజ్, అర్‌డబ్లుఎస్, విద్యుత్, ఇరిగేషషన్ డిఈఈలు, ఎఈఈలు, విద్య, వైద్యశాఖతో పాటు తహాశీల్దారు, పోలీస్‌శాఖ, నారాయణవనం, కీళగరం పంచాయతీ కార్యదర్శులతో పాటు కూటమి ప్రభుత్వం నాయకులు, ఎంపిపి, జడ్పీటీసీ, ఎంపిటిసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అందరు పాల్గొనాలని కోరారు

## అంకురార్పణతో ప్రారంభమైన పరాశారేశ్వరుని బ్రహ్మోత్సవాలు



నారాయణవనం, జూన్ 14 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనంలో టిటిడి అనుబంధ ఆలయంగా ప్రసిద్ధి చెందిన చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం సాయంత్రం గణపతిపూజ, అంకురార్పరణతో ప్రారంభమైనది. అంతకుముందు స్వామి, అమ్మవార్లను తిరుచ్చివాహనంపై అలంకరించి ఆలయంలోనే ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. సాయంత్రం గణపతిపూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం అంకురార్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఓ నాగరత్న, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు రమణి గురుకల్, రమేష్ గురుకుల్, సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు ధ్వజారోహణం :**

నారాయణవనంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి సోమవారం ఉదయం ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ పర్యవేక్షులు నాగరాజు తెలిపారు.

## సత్యవేడు నియోజకవర్గ టిడిపి బిఎల్ఎ ఇంచార్జీగా

కోనేటి సుమన్‌కుమార్ నియామకం

నారాయణవనం, జూన్ 14 ప్రభాతవార్త :



సత్యవేడు తెలుగుదేశం పార్టీ బిఎల్ఎ ఇంచార్జీగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, నారాయణవనం జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్‌ను అధిష్టానం నియమించడం పట్ల పలువురు కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు అభినందలు తెలిపారు. ఆదివారం తిరుపతి టిడిపి కార్యాలయంలో సత్యవేడు టిడిపి ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కె శంకర్‌రెడ్డితో పాటు బిఎల్ఎగా నియమితులైన కోనేటి సుమన్‌కుమార్ ధ్రువపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కోనేటి సుమన్‌కుమార్ మీడియాతో పాటు టిడిపి అధిష్టానం తనపై నమ్మకంతో కట్టబెట్టిన బిఎల్ఎ ఇంచార్జీ పదవికి వన్నె తెస్తానని, సత్యవేడు నియోజకవర్గంలో టిడిపి పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేస్తానని హామి ఇచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్య పరిస్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అధిష్టానం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అహర్నిశలు కృషి చేయడంతో పాటు అంకితభావంతో పార్టీ కోసం పని చేస్తానని హామి ఇచ్చారు.

## ఆలయాల్లో ఘనంగా అమావాస్య పూజలు

నారాయణవనం, జూన్ 14 ప్రభాతవార్త :



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. నెయ్యి, కొబ్బరినీరు, పశుపు, కుంకమ, చందనం, విభూది వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అంతకుముందు పవిత్ర జలపాతంలో స్నానాలను చేసారు. మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా అన్నదానం చేసారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయులస్వామి ఆలయంలోను అమావాస్య పూజలను ఘనంగా జరిపారు. స్వామివారికి అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన ం నిర్వహించారు. అలాగే నారాయణవనం ఎగువ పద్మశాలీవీధిలో వెలసిన శ్రీ వీరరాఘవుల స్వామి ఆలయంలోను అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు.

## పాము కాటుతో మహిళ మృతి

వరదయ్యపాలెం, జూన్ 14, ప్రభాతవార్త



వరదయ్యపాలెం మండలం పెద్ద పాండూరు పంచాయితీ సిద్దేశ్వర పురం గ్రామంలో ముని కిష్టయ్య సతీమణి జమున(45) ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో పాముకాటుకు గురైంది. విద్యుత్ ఆగి రావడంతో చీకట్లో నాగు పాము ఇంటిలో కరిచిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అది గమనించిన గ్రామస్తులు దగ్గరలో ఉన్న చిన్న పాండూరు ప్రభుత్వ హాస్పిటల్‌కి తీసుకొని వెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సత్యవేడు ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. ఆస్పత్రికి వెళ్లే లోపు ఆమె మరణించినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. జమున మృతికి సిద్దేశ్వరపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఫుట్‌బాల్ అసోసియేషన్‌చే బాల బాలికలు ఎంపిక



తిరుపతి క్రీడ, జూన్ 14, ప్రభాతవార్త

తిరుపతిలోని ఎస్వీయూ తారకరామా స్టేడియంలో జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ మరియు సబ్ జూనియర్ బాల బాలికలకు సెలక్షన్ ట్రైల్స్ ఆదివారం నిర్వహించారు. సూళ్లూరుపేట, నాయుడుపేట, రేణిగుంట, చంద్రగిరి జిల్లాలోని నలుమూలల నుండి దాదాపుగా 250 మందికి పైగా క్రీడాకారులు సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. సెలక్షన్ కమిటీలో జిల్లా కోచ్ వినోద్ రమేష్, భాషా ఆధ్వర్యంలో సెలక్షన్ నిర్వహించారు. జిల్లా నలమూలం నుంచి సెలక్షన్‌లో పాల్గొన్నటువంటి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకి అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రమణ సభ్యులు బాబు అచ్యుత్, సీనియర్ క్రీడాకారులు సెక్రెటరీ రెడ్డప్ప ఈ సెలక్షన్స్‌లో పాల్గొని దిగ్విజయంగా పూర్తి చేసారు.

# సెటిల్మెంట్ స్థలంలో మున్సిపల్ భవనాలు

## అడ్డుకుంటే పాత కమిషనర్ దౌర్జన్యం
## పి.ఎస్ పెరుమాళ్ రెడ్డి



తొట్టంబేడు జూన్ 14 ప్రభాతవార్త

తనకు సంబంధించిన సెటిల్‌మెంట్ స్థలంలో మున్సిపాలిటి అధికారులు నిర్మాణాలు చేపడితే అడ్డుకోవటంతో పాత కమిషనర్ దురుసుగా వ్యవ హారించారని పెరుమాళ్‌రెడ్డి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధ్వజమె త్తారు. గతంలో మున్సిపల్ కమిషనర్ పని చేసిన అధికారి మూర్ఖంగా వ్యవహారించారన్నారు. తన వద్ద అన్ని ఆధారాలున్నా నేనింతే అంటూ అక్రమంగా తన స్థలంలో నిర్మాణాలు చేపట్టారని వివరించారు. ఈ సందర్భంగా ఆయన తనకు కోర్డు ఇచ్చిన స్టేను అలాగే తన భూములకు సంబంధించి ఆధారాలనుచూపారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తొట్టంబేడు గ్రామం సర్వే నెంబర్ 298/3 లో 1,78, సెంట్లు భూమిని సెటిల్మెంట్ ల్యాండ్ ను 2016 సంవత్సరంలో తిరుపతి భవాని నగర్ రూప్ చంద్ వద్ద కొనుగోలు చేయడం జరిగిందని ఆదివారం పత్రిక సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మున్సిపాలిటీ అధికారులు ఈ భూమి మాది అని మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. మాకు హైకోర్టు ఆర్డర్ ఉన్న లెక్కచేయకుండా మా సెటిల్మెంట్ ల్యాండ్ లో మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారు. నా సెటిల్మెంట్ ల్యాండ్ లో శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారులు రూమ్ నిర్మాణం చేపడుతున్నారు . నా సెటిల్మెంట్ ల్యాండ్ లో రూమ్ నిర్మిస్తున్నారని, దానిని నిర్మించకూడదు అని చెప్పినా పట్టించుకోకుండా తనను ఇబ్బంది పెడుతున్నారన్నారు. హైకోర్టు పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఉన్న శ్రీకాళహస్తి మున్సిపాలిటీ అధికారులు లెక్కచేయకుండా కోర్టు ఆర్డర్ ను ధిక్కరిస్తున్నారని, ఒకసారి విచారణ చేపట్టి మాకు తగు న్యాయం చేయవలసిందిగా అధికారులను కోరుతున్నామని తెలియజేశారు.

# చాపక్రింద నీరులా అక్రమాలు!

## పట్టుబడితేనే వెలుగుచూస్తున్న వసూళ్ళ వాస్తవాలు -పోలీస్‌శాఖను హడలెత్తిస్తున్న మామూళ్ళు



ప్రభాతవార్త–తిరుపతి:

సమాజంలో పోలీసుశాఖపై ప్రజలకు నమ్మకం కలిగించేలా ఓ వైపు ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించి ఆ దిశగా ముందుకు వెళుతున్నా క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు,సిబ్బంది అక్రమాలతో శాఖకు చెడ్డపేరు మూటగట్టుకోవాల్సి వస్తోంది. చాపక్రింద నీరులా వసూళ్ళుచేసుకుంటూ అందినకాడికి దండుకుంటుండటం ఇందుకు నిదర్శనమే. పోలీస్‌శాఖలో పట్టుబడితేనే వసూల్‌రాజాలు గురించి వెలుగుచూస్తోంది. లేకుంటే చాపక్రింద నీరులా మామూళ్ళతో అందినకాడికి రాబట్టుకుని రాజాల్లా చలామణి అవుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, గంజాయి మాదకద్రవ్యాల అక్రమరవాణా,విక్రయాలు పూర్తిగా కట్టడిచేయాలని స్వయంగా సిఎం చంద్రబాబునాయుడు, డిజిపి హరీశ్‌కుమార్‌గుప్త, డిఐజి షిమోషి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తీవ్రంగా హెచ్చరికలు ఆదేశాలు ఇచ్చారు. అయినా మమాళ్ళకు అలవాటుపడిన కొందరు పోలీసులు, పోలీస్ అధికారులు ఇవేమీ తమకు కాదన్నట్లు వారివాని వారు చేసుకెళుతండటంతో చట్టపరిధిలో శిక్షకు బలవుతున్నారు. ఇటీవల ఏకంగా తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సిఐ,ఎస్వీయూనివర్సిటీ సిఐతోబాటు ఓ ఏఎస్ఐ, ఇద్దరు పోలీసులు సస్పెన్షన్‌కు గురయ్యారు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించాల్సి న ఓ సిఐ తనదైన రీతిలో చట్టాన్ని చేతిలోకి తీసుకుని ఏకంగా ఓ కేసు విషయంలో బారీగా మామూళ్ళ్ళ తీసుకుని న్యాయం చేయలేదనేది స్వయంగా బాధితుడు ఎస్పీకి మొరపెట్టుకున్నారు. అలాగే మరో సిఐ తన ఒంటిపై ఖాకీ దుస్తులు చూపి ఏకంగా వసూళ్ల అవతారం ఎత్తాడు. భారీగా స్టేషన్‌కు వచ్చిన జనం నుండి లక్షలాదిరూపాయలు రాబట్టుకుని తిరిగి ఇవ్వలేదనేది ప్రధాన పిర్యాదులు. వీరికి సహకరించిన మరో ముగ్గురు కానిస్టేబుళ్ళపై వేటుపడింది. ఇక తాజాగా వారంరోజుల క్రిందట ఆంధ్రప్రదేశ్ పోలీసులే విస్తుబోయే రీతిలో గత దశాబ్ధకాలంపైగా మట్కాజూదం నడుపుతూ కోట్లాదిరూపాయలు ఆర్జించిన కింగ్‌ఫిన్ పద్మనాభం ఎస్పీ ఆధీనంలోని ప్రత్యేక బృందం పోలీసులకు జిక్కాడు. అతను నడుపుతున్న మట్కాజూదం వ్యవహారం మొత్తం గుట్టురట్టయ్యింది. లోతుగా విచారణ చేయడంతో దశాబ్ధకాలంలో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సబ్‌డివిజన్‌లోఅతని అక్రమ కార్యకలాపాలకు. అసాంఘిక కార్యకలాపాలకు సహకరించినట్లు తేలడంతో ఇద్దరు సిఐలను విధుల నుండి ఏకంగా సస్పెండ్ చేయడం సంచలనంగా మారింది. వీరితోబాటు నలుగురు కానిస్టేబుళ్ళు పై సస్పెండ్ వేటుపడింది. ఏకంగా ఈ వ్యవహారంపై నిఘా ఉంచి నివేదికలు పై అధికారులకు పంపాల్సి న డిఎస్పీ అధికారి కూడా వంతపాడారని తెలిసి ఛార్జిమెమో జారీ చేశారు. అయితే ఇంకా మట్కాకింగ్‌ఫిన్ పద్మనాభం ఇచ్చిన వాంగ్మూలంతో ఈ పదేళ్ళకాలంలో సహకరించిన పోలీసు అధికారులు, కొందరు పోలీసులపై చర్యలు తీసుకునే దిశగా విచారణ సాగుతోందని తెలుస్తోంది. ఇదే నిజమైతే మరెంతమంది పోలీసులపై శాఖాపరమైన వేటు పడతుందనేది పోలీసుశాఖలో గుప్పుమంటోంది. పైగా ఇంకా జిల్లాలో ప్రధానంగా తిరుపతి డివిజన్‌లో కొన్ని పోలీస్ స్టేషన్‌లలో సిఐలు ఎస్‌హెచ్‌ఓలుగా, ఐఓలుగా వ్యవహరిస్తున్నా కొందరు ఎస్‌ఐలు ఏకంగా స్టేషన్ రైటర్‌లు పెత్తనం చలాయిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. స్టేషన్‌లో కానిస్టేబుళ్ళ నుండి ఏఎస్ఐల వరకు డ్యూటీలు వేయాలన్నా ,ఆప్‌లు ఇవ్వాలన్నా రైటర్‌లే కీలకంగా మారారని పోలీసుశాఖలోనే గుప్పుమంటోంది. కొన్ని స్టేషన్‌లలో రైటర్‌లే తమకు నమ్మకస్తులైన తోటి పోలీసు కానిస్టేబుళ్ళను అక్కున చేర్చుకుని వసూళ్ళ పర్వం మొదలుపెట్టి అందిన కాడికి హోటళ్ళనుండి, మద్యం షాపులు, బార్లనుండి ,ఇంకా కొన్ని దుకాణాల నుండి మామూళ్ళు దండుకుంటున్నారనేది ప్రధాన ఆరోపణలు. ఇవన్నీ కూడా కొందరు సిఐలు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో స్టేషన్‌లలో రైటర్‌లు అసలు విధులు కంటే కోసరు విధులైన వసూళ్ళకే మొగ్గుచూపి పై అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారనే ప్రధాన ఆరోపణలు బలంగా పోలీసుల్లోనే వినిపిస్తోంది. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అక్రమార్కులపై, అవినీతిపరులపై తన గూఢచారులతో నిఘా ఉంచి ఎక్కడికక్కడే అవినీతిని అడ్డుకునేందుకు చేస్తున్న చర్యలుతో ఇప్పుడు వసూల్‌రాజాల్లో భయం పట్టుకుందని పోలీసువర్గాల్లో హాట్‌టాఫిక్.

# బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

గుడిపాల, జూన్ 14 ప్రభాతవార్త:



గుడిపాల మండల పరిధిలో బెల్ట్‌షాపు నిర్వ హిస్తూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎగువ పిళ్ళారి కుప్పం గ్రామంలో వెంకటేశ్వరరెడ్డి(45) అనే వ్యక్తి బెల్టు షాపు నిర్వహిస్తూ 120 క్వాటర్ బాటిళ్ళు నిల్వ వుంచి విక్రయాలు చేస్తున్నాడు. గుడిపాల పోలీసులు నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా ఎగువ పిళ్ళారి కుప్పం గ్రామంలో వెంకటేశ్వరరెడ్డి బెల్ట్‌షా పును తనిఖీ చేస్తే అక్కడ పోలీసులకు 120 క్వాటర్ మద్యం బాటిళ్ళు లభ్యం అయ్యాయి. పోలీసులు ఈ క్వాటర్ మద్యం బాటిళ్ళను సీజ్ చేసి వెంకటేశ్వర్‌రెడ్డిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయి ఉద్యమాలు

## ఎపిటిఎఫ్ నిర్ణయం

## రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల



శ్రీకాళహస్తి, జూన్ 14 ప్రభాతవార్త

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దశల వారిగా రాష్ట్ర స్థాయి ఉద్యమాలకు ఎపిటిఎఫ్ సిద్ధమౌతుందని రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల అన్నారు. ఇక్కడి బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఉద్యమ అధ్యయన తరగతుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు మంజులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలు ఇసుక పాత్రలా మారుతున్నాయన్నారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్‌లో విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23(1)కి చట్ట సవరణ చేసి సీనియర్ ఉపాధ్యాయులను టెట్‌పరీక్ష నుంచి మినహాంపు ఇవ్వాలని అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి తీసుకురావాలని పిలుపు నిచ్చారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025 ప్రకారం మేనేజ్‌మెంట్ టీచర్స్‌ను లోకల్ కేడర్‌గా ఆర్గనైజ్ చేయాలని అమె పిలుపు నిచ్చారు. 12వ పిఆర్‌సి కమిషన్ చైర్మెన్ ను నియమించి మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలని కోరారు. ఎపెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలు ప్రకటించి ఉపాధ్యాయులను సంతృప్తి పరచాలన్నారు. ఆర్థిక బకాయిలు చెల్లించాలన్నారు. బదిలి పొందిన ఉపాధ్యాయులను వవెంటనే రిలీవ్ చేయాలని కోరారు. కేడర్ బైఫరికేషన్ పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. విద్యాశాఖ మంత్రి చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించి కోరారు. విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని కరారు. సిపిఎస్ రద్దు చేసి ఓపియస్ అందరికి అమలు చేయాలని లేదంటే ఆందోళనలు తప్పవని మంజులు హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లోకల్ కేడర్ ఆర్గనైజేషన్ పై పూర్తి అవగాహన ఉన్న నేపథ్యంలో స్వయంగా కల్పించుకొని కామన్ సీనియారిటి ఆధారంగా పదోన్నతులకు అవకాశం కల్పించాలని కోరారు. నేడు పాఠశాల విద్యారంగం అనేక ఆటుపోటులకు గురౌతూ సంక్షోభంలో ఉందన్నారు. విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ బాగా చేసి పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచాలని చెబుతూ ఉంటే మరోక వైపున పాఠశాలల ప్రారంభం రోజునే తల్లికి వందనం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రచారం చేసి నేడు ఇవ్వక పోవటం తల్లి దండ్రుల్లో తీవ్ర నిరాశ కల్గిస్తుందన్నారు.

### ప్రభుత్వ విధానాలు ప్రైవేటును బలపరచేలా ఉన్నాయి: జిల్లా కార్యదర్శి

ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మురళీకృష్ణ మాట్లాడుతూ నేడు ప్రభుత్వ విధానాలు ప్రైవేటును బలపరచే విధంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులు, విద్యార్థులపైవత్తిడి లేని బోధనాంశాలు ఉండాలని ఆయన డిమాండ్ చేసారు. జిఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌కుకి జిల్లాలో ఏ కేంద్రంలనైనా హాజరయ్యే విధ:గాంగా వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేసారు. పిఎఫ్ రుణం పొందే ఉపాధ్యాయులు మెడికల్ గ్రౌండ్స్ ఏ మెడికల్ ప్రాక్టీషినర్ జారి చేసిన సర్టిఫికేట్ అయినా అనుమతిస్తారని ఆ మేరకు జిల్లా అ డిట్ అధజకారి స్పష్టం చేసారని మురళీకృష్ణ అన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ 12వ పీఆర్‌సి కమిషన్ చైర్మెన్‌ను నియమించి మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలని పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను ప్రకటించాలని టెట్‌లో సీనియర్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షులు గోపాల్ ప్రధాన కార్యదర్శి కె.వెంకటాద్రి,ఏవెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి బి.హేమకుమార్, చంద్రశేఖర్,సరస్వతి కవిత,పావని ఆశిక, కల్పన, ఝాన్సి ఉదయకుమారి, భువనేశ్వరి రమణమ్మ, సుమలత, రామదాసు, ఉదయ్‌కుమార్, రామసుబ్బయ్య, చెంచురాజా,తడ నాయుడుపేట గూడూరు, సూళూరుపేటల నుంచి ఉపాధ్యాయులు తరలి వచ్చారు.

# రుయా ఆసుపత్రిలో ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం



తిరుపతి హెల్త్, జూన్ 14, ప్రభాతవార్త

తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రుయా ఆసుపత్రి అదనపు వైద్య విద్య సంచాలకులు, సూపరింటెండెంట్ డా. బి. మనోహర్, తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వి. బాలకృష్ణ నాయక్, పాథాలజీ విభాగాధిపతి డా. ఇంద్రాణి, సీఎస్ఆర్ఎంఓ డా. సుబ్బలక్ష్మమ్మ, మోడల్ బ్లడ్ సెంటర్ ఇన్‌ఛార్జి డా. పి. భార్గవి, వైద్యులు, సిబ్బంది, స్వచ్ఛంద రక్తదాతలు, శిబిర నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. బి. మనోహర్ మాట్లాడుతూ తలసేమియా అనేది జన్యుపరమైన రక్తహీనత వ్యాధి అని, ఈ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు జీవితాంతం క్రమం తప్పకుండా రక్త మార్పిడి అవసరమని తెలిపారు. తలసేమియా మేజర్‌తో బాధపడే పిల్లలకు సాధారణంగా ప్రతి మూడు నుంచి నాలుగు వారాలకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, సరైన సమయంలో రక్తం అందించకపోతే పిల్లల ఎదుగుదల, శారీరక మరియు మానసిక వికాసం దెబ్బతింటుందని చెప్పారు. ప్రభుత్వ రక్త కేంద్రాల ద్వారా ఇటువంటి చిన్నారులకు సురక్షితమైన రక్తాన్ని నిరంతరం అందించడం జరుగుతోందని తెలిపారు. ప్రతి రక్తదాత అందించే ఒక్క యూనిట్ రక్తం ఒక తలసేమియా చిన్నారి జీవితంలో ఆశాకిరణంగా నిలుస్తుందని, స్వచ్ఛంద రక్తదానం ద్వారా ఎన్నో కుటుంబాల్లో ఆనందాన్ని నింపవచ్చని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వి. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ రక్తం అనేది కృత్రిమంగా తయారు చేయలేని అమూల్యమైన జీవద్రవమని, దీనికి ప్రత్యామ్నాయం లేదని తెలిపారు. రోడ్డు రవాణా ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, క్యాన్సర్ రోగులు, తలసేమియా చిన్నారులు, రక్తహీనతతో బాధపడుతున్న రోగులు, డెంగ్యూ బాధితులు, కాలిన గాయాల రోగులు వంటి అనేక సందర్భాల్లో రక్తం అత్యంత అవసరమవుతుందని పేర్కొన్నారు. రక్తదాతల నుంచి సేకరించిన ప్రతి యూనిట్ రక్తాన్ని ప్రభుత్వ రక్త కేంద్రాల్లో అత్యంత శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేస్తామని ఆయన తెలిపారు. ముందుగా దాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి రక్త సేకరణ చేపడతారని, అనంతరం రక్తగ్రూపు నిర్ధారణతో పాటు హెచ్ఐవీ, హెపటైటిస్‌బి, హెపటైటిస్‌సి, సిఫిలిస్, మలేరియా వంటి అంటువ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. అన్ని పరీక్షల్లో సురక్షితంగా నిర్ధారించిన రక్తాన్ని మాత్రమే రోగులకు వినియోగిస్తామని తెలిపారు. అలాగే ఒక యూనిట్ రక్తాన్ని ప్యాక్డ్ రెడ్ సెల్స్, ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా, ప్లేట్‌లెట్లు, క్రయోప్రెసిపిటేట్ వంటి రక్త భాగాలుగా విభజించి అవసరాన్ని బట్టి వివిధ రోగులకు అందించడం జరుగుతుందని చెప్పారు. ఒక్క రక్తదానం ద్వారా నలుగురు వరకు రోగులకు ప్రాణదానం చేయవచ్చని ఆయన వివరించారు. ఎర్ర రక్తకణాలు రక్తహీనత, ప్రమాదాలు, శస్త్రచికిత్సల రోగులకు, ప్లేట్‌లెట్లు డెంగ్యూ మరియు క్యాన్సర్ రోగులకు, ప్లాస్మా కాలిన గాయాలు మరియు కాలేయ వ్యాధుల రోగులకు, క్రయోప్రెసిపిటేట్ రక్తం గడ్డకట్టని వ్యాధులతో బాధపడే రోగులకు ఉపయోగపడుతుందని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏదైనా వైద్య అత్యవసర పరిస్థితి, ట్రామా లేదా రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ సిబ్బంది, బ్లడ్ సెంటర్ సిబ్బంది సమన్వయంతో ముందుండి వైద్యం అందించి అనేక మంది ప్రాణాలను కాపాడుతున్నారని డా. వి. బాలకృష్ణ నాయక్ కొనియాడారు. రక్తం అందుబాటులో ఉన్నప్పుడే అత్యవసర పరిస్థితుల్లో మరింత వేగంగా ప్రాణాలను రక్షించగలమని పేర్కొన్నారు. పాథాలజీ విభాగాధిపతి డా. ఇంద్రాణి, సీఎస్ఆర్ఎంఓ డా. సుబ్బలక్ష్మమ్మ మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదానం మానవత్వానికి ప్రతీక అని, ప్రతి ఆరోగ్యవంతుడు సంవత్సరానికి కనీసం రెండు నుంచి మూడు సార్లు రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. మోడల్ బ్లడ్ సెంటర్, ఎస్వీఆర్ఆర్‌జీజీహెచ్ తిరుపతి ఇన్‌ఛార్జి డా. పి. భార్గవి ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లు, బ్లడ్ మొబైల్ టీమ్, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి బ్లడ్ సెంటర్ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమం ముగింపులో స్వచ్ఛంద రక్తదాతలు, రక్తదాన శిబిర నిర్వాహకులను ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, మొమెంటోలు అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన రక్త నిల్వలు ఉండేలా సమాజంలో మరింత అవగాహన కల్పించాలని, ఎక్కువ సంఖ్యలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ రక్త కేంద్రాల్లో రక్త నిల్వలను పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. మీడియా సోదరులు కూడా రక్తదానం యొక్క ప్రాముఖ్యతను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి మరింత మంది స్వచ్ఛంద రక్తదాతలను ముందుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క చుక్క మానవత్వం – రక్తదానం చేయండి, ప్రాణాలను కాపాడండి అనే సందేశంతో ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.





తిరుపతి నగరం పవిత్రతను, ప్రశాంతతను కాపాడటంతోబాటు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపేందుకు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి తిరుపతి నగరంలోని రద్దీ ప్రాంతాలతోబాటు స్టే హోమ్స్, స్టార్ హోటళ్ళు, లాడ్జీలు ,ఓ మోస్తరు లాడ్జిలే టార్గెట్ చేసుకుని నిశితంగా తనిఖీలు చేపట్టారు. గదుల్లో ఉంటున్న వారెవరు, ఎక్కడ నుండి వచ్చారు. ఎందుకు వచ్చారనే వివరాలను రాబట్టారు. ఓవైపు సిసికెమెరాలలో పర్యవేక్షిస్తూ మరో వైపు డ్రోన్‌కెమెరాలతో నిఘా ఉంచారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

# కేంద్ర సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ మంత్రికి ఘన స్వాగతం

తిరుమల, జూన్ 14, ప్రభాతవార్త

తిరుమలకు విచ్చేసిన కేంద్ర సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ కు, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి స్వాగతం పలికారు. మంత్రితోపాటు తమిళనాడు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు నయనారు నాగేంద్రన్, తమిళనాడు బిజెపి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ మేనన్, చెన్నై దక్షి ణ బిజెపి జిల్లా అధ్యక్షుడు, నాగరాజ్ ఉన్నారు.

జనసేన

# పంచాయతీ పొత్తులపై 'జనసేన, బిజెపి' ఆశలు

## - పొత్తులో వున్న పార్టీలకు 30 శాతం సీట్లు కేటాయిస్తారని అంచనాలో నేతలు

చిత్తూరు, జూన్ 14 ప్రభాతవార్త:

పార్టీ గుర్తుల రహితంగా జరిగే పంచాయతీ ఎన్నికలపై కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా వున్న జనసేన, భారతీయ జనతా పార్టీల నాయకులు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర స్థాయిలో జనసేన, బిజెపి పార్టీ అధిష్టానాలు కూటమి ప్రభుత్వంలో పెద్ద పార్టీగా వున్న తెలుగుదేశం పార్టీకి లబ్ది కలిగేలా ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన, బిజెపి పార్టీల అధిష్టానాలు పట్టుపట్టి క్షేత్ర స్థాయిలో పార్టీ పునాదులను పటిష్టం చేసుకోవడంపై దృష్టి సారిస్తారని జిల్లా, మండల స్థాయి నాయకులు ఊహల పల్లకిలో విహరిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం భర్తీ చేసిన ఎమ్మెల్సీలు, రాజ్యసభ స్థానాలతో పాటు నామినేటెడ్ పదవుల భర్తీలో కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా వున్న జనసేన, బిజెపి పార్టీలకు ఆశించిన స్థాయిలో పదవులు దక్కలేదు. ఈ క్రమంలో త్వరలో జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా వీలైనంత మేరకు ఎక్కువ స్థానాలను తమ పార్టీ అధిష్టానంలోని నేతలు తీసుకుంటారని జిల్లా, మండల, గ్రామ స్థాయి జనసేన, బిజెపి పార్టీల నాయకులు ఆశిస్తున్నారు. రాష్ట్రంలో 2024 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతాపార్టీలు పొత్తులు పెట్టుకుని పోటీ చేశారు. ఈ ఎన్నికల పొత్తులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి జనసేన పార్టీకి ఒక్క తిరుపతి అసెంబ్లీ స్థానం మాత్రం కేటాయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో లోక్‌సభ, మిగిలిన అసెంబ్లీ స్థానాల్లో ఏ ఒక్కదానిని తెలుగుదేశం పార్టీ పొత్తులో వున్న జనసేన, బిజెపి పార్టీలకు కేటాయించలేదు. తిరుపతి నుండి జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన జంగాలపల్లి శ్రీనివాసులు ఎన్నికల్లో విజయం సాధించి ప్రస్తుతం తిరుపతి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఆపై జరిగిన నామినేటెడ్ పదవుల భర్తీలో సైతం కూటమిలో పెద్దపార్టీగా వున్న తెలుగుదేశం పార్టీ జనసేన, బిజెపి పార్టీ నాయకులకు పెద్దగా నామినేటెడ్ పదవులు కట్టబెట్టలేదు. జిల్లాలో వున్న నామినేటెడ్ పోస్టులకు సంబంధించి మెజార్టీ ఛైర్మన్ స్థానాలను తెలుగుదేశం పార్టీ తమ పార్టీ నాయకులను ఎంపిక చేసి, ఆ సంస్థలోని డైరెక్టర్ స్థానాల్లో ఒకటి రెండు స్థానాలను మాత్రం జనసేన, బిజెపి పార్టీ నాయకులకు కట్టబెట్టింది. నామినేటెడ్ పదవుల్లో తమకు అన్యాయం జరిగిందని ఇప్పటికీ జిల్లాలోని జనసేన, బిజెపి నాయకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం పంచాయతీ పాలకవర్గాలకు పదవి కాలం ముగియడం, ప్రభుత్వం వీటికి స్పెషల్ ఆఫీసర్లను నియమించి పాలన సాగిస్తోంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగినా రెండు నెలల్లో పదవి కాలం పూర్తి కానున్నా జడ్పీటీసీ, ఎంపిటిసీ ఎన్నికలు మాత్రం పార్టీ గుర్తులపై జరుగనున్నాయి. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగనుండటంతో క్షేత్ర స్థాయిలో అభ్యర్థులను పార్టీ పెద్దలు నిర్ణయించాల్సి వుండటంతో పంచాయతీ ఎన్నికల్లో వున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి క్షేత్ర స్థాయిలో పార్టీలను తీసుకెళ్ళాలని జనసేన, బిజెపి నాయకులు భావిస్తున్నారు. జిల్లాలో మొత్తం 621 గ్రామ పంచాయతీలు వుండగా ఇందులో పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీలకు 30 శాతం మేరకు సీట్లు కేటాయిస్తారని క్షేత్ర స్థాయిలో జనసేన, బిజెపి నాయకులు ఆశిస్తున్నారు. ఈ మేరకు పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీలో పెద్ద పార్టీగా వున్న తెలుగుదేశం పార్టీ జనసేన, బిజెపి పార్టీలకు పంచాయతీలను కేటాయించాల్సి వస్తే 150 పంచాయతీల మేరకు కేటాయించాల్సి వుంటుంది. అయితే కూటమి పార్టీలో పెద్ద పార్టీగా వున్న తెలుగుదేశం పార్టీ జనసేన, బిజెపి పార్టీలకు అంత పెద్ద మొత్తంలో కేటాయిస్తారా! లేదా! అనేది చూడాల్సి వుంది.

జిల్లాలో ఇటు జనసేన, అటు భారతీయ జనతా పార్టీలకు క్షేత్ర స్థాయిలో ఇప్పటికీ ఆశించిన పట్టు లేదు. జిల్లాలో క్షేత్ర స్థాయిలో ఇప్పటికీ తెలుగుదేశం పార్టీకి మంచి పట్టు వుంది. ఈ పరిస్థితుల్లో క్షేత్ర స్థాయిలో పట్టు లేని జనసేన, బిజెపి పార్టీలకు పెద్ద మొత్తంలో పంచాయతీ స్థానాలను క్షేత్ర స్థాయిలో పట్టు వున్న తెలుగుదేశం పార్టీ కేటాయిస్తుందా! ఇందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు అంగీకరిస్తారా! అనేది వేచి చూడాల్సి వుంది.